

ఆదివారం

ప్రజాశక్తి

జూలై 11, 2004

మేఘ మథనం

హ్యాపీ బర్త్‌డే

(11-7-2004 నుండి 17-7-2004 వరకు)

డి. భువనేశ్వరి
జులై-12
రాజేశ్వరి-రాజయ్య
వరంగల్

హితేష్ అరవింద్
5సం॥, 13.7.1999
కల్పన-హరిబాబు
అన్నారెడ్డిపాలెం-నెల్లూరు

ఎమ్. హరిప్రియ
6సం॥, 15.7.1998
రజని-హరనాథ్
మచిలీపట్నం-కృష్ణా

మనోజ్‌కుమార్
2సం॥, 16.7.2002
సునీత-శ్రీనివాస్
మడిపల్లి-వరంగల్

శ్రావణి
1సం॥, 16.7.2003
లక్ష్మి-నర్సింలు
షాబాద్-రంగారెడ్డి

జ్ఞానప్రకాశ్
1సం॥, 17.7.2003
సుగుణ-నారాయణ
మక్తల్-మ॥నగర్

ఎన్. జ్యోత్స్న
2సం॥, జులై-2002
ఆశాలత-వెంకటేశ్వరరెడ్డి
పొదిలి-ప్రకాశం

జి. రాజావికాస్
10సం॥, జులై-1994
వేణి-వినయ్‌ప్రకాష్
సింగ్‌నగర్-విజయవాడ

కె. రాజశేఖర్‌రెడ్డి
2సం॥, జులై-2002
పద్మ-దుర్గారెడ్డి
నాంచారుపల్లి-మెదక్

ఆర్. సింహాద్రి
అర్చన-రాజు
భువనగిరి-నల్లగొండ

గౌతమ్‌రెడ్డి
జనిత-సురేందర్‌రెడ్డి
గుర్రప్పగూడెం-నల్లగొండ

గమనిక: పదేళ్ళ వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4 ,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

కవర్‌స్టోరీ ఆసక్తికరం

జూన్ 27 ఆదివారం సంచికలో ప్రచురించిన కవర్ స్టోరీ 'అవినీతిగని ప్రపంచ బ్యాంక్' ఆద్యంతం ఆసక్తితో చదివింప చేసింది. వివిధ దేశాధినేతలు అవినీతితో దోచుకున్న డబ్బు వివరాలు చదువుతుంటే ఆశ్చర్యం కలిగింది. అదే విధంగా ఆరోగ్యం శీర్షికలో 'మధుమేహాన్ని' ఇతర వ్యాధులకు వాడే మందులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తెలుసుకొని విస్మయం చెందాం. 'లావు'కు సంబంధించిన వ్యాసం కూడా వివరణాత్మకంగా ఉండి, లావు సమస్యకు పరిష్కారం దిశగా పరిశోధనలు జరుగుతున్నాయని తెలుసుకొన్నాం. అదే విధంగా 'ఉత్తమ ఉద్యోగిని' దేశ్‌మాల్ వ్యాసం ఆమె పనితనాన్ని గురించి విపులంగా వివరించింది. అంధురాలైనప్పటికీ 'ఉత్తమ ఉద్యోగిని' అవార్డు పొందడం ప్రశంసనీయం. చాలా మంచి మంచి విషయాలు తెలుపుతున్నందుకు ఆనందంగా వుంది.

– ఎం.డి.ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్ జిల్లా

దేశమాల్ అందరికీ ఆదర్శం

27 జూన్ ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన ఉన్నత ఉద్యోగిని. కంప్యూటర్ డిప్లొమాలో మొదటి అంధురాలిగా చరిత్రలో నిలిచిపోయిన దేశమాల్ నిజంగా ఈ దేశానికే ఎంతో గర్వకారణం. తనకు చూపులేకపోయినా మనసనే మనో నేత్రంలో చూడగల మనోవికాసిని దేశ్‌మాల్ లాంటి వాళ్ళు ఈ భారత గడ్డపై జన్మించటం నిజంగా గర్వకారణం.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

ఔరా చాలా బాగుంది

ప్రజాశక్తి ఆది వారం అనుబంధం లో 'ఔరా' శీర్షికలో ఇస్తున్న అంశాలు విజ్ఞానాత్మకంగా, ఆశ్చర్యజనకంగా వుంటున్నాయి. గత నెల 27వ తేదీన ప్రచురించిన 'గిన్నీస్ బుక్‌లో కోడిపెట్ట' అనే అంశం చాలా ఆశ్చర్యంగా వుంది. మామూలుగా అయితే కోడిని పెంచుకునే వారు కొద్దినెలలకే దాన్ని పులుసు చేసేస్తారు. ఆ కోడి యజమాని నిజంగా గ్రేట్.

– మద్దా సుధీర్‌బాబు,
వానపాముల, కృష్ణాజిల్లా

దేవదాస్ సమీక్ష హైలెట్

జూన్ 27 ఆదివారం అనుబంధంలో పుస్తక పరిచయం శీర్షిక కింద అమర ప్రేమికుడు దేవదాస్ విశ్లేషణను చాలా అరుదైన మాటల్లో సమీక్షించి పాఠకులకు ఒక తీపి అనుభూతిని రగిల్చారు. ముఖ్యంగా దేవదాసు చేత తిరస్కరింపబడిన ఇద్దరు మగువలు ఒకరు కన్నియ పార్వతి – రెండవది ప్రౌఢ చంద్రముఖి. వీరుభయులూ భిన్నంగా స్పందించారు. మొదటి తిరస్కారం ఒకరి అభిమానాన్ని గాయపరచగా, రెండవ తిరస్కారం ప్రేమను జ్వలింప చేస్తుంది. బెంగాలీ మాతృక మనకు తెలియకపోయినా తెలుగు అనువాదం మనకు జ్ఞాపకం ఉండిపోతుంది.

– పి.వెంకటయ్య,
పరకాల, వరంగల్ జిల్లా

గ్రామ జీవితానికి దర్పణం

జూన్ 27వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'సడక్' కథ నేటి తెలంగాణా పల్లె జీవితానికి దర్పణం పట్టింది. మారిపోతున్న గ్రామీణ జీవితం, ఒట్టిపోతున్న పల్లెలు, రైతుల కష్టాలు తీర్చలేని రోడ్లు, పథకాలను చర్చిస్తూ రచయిత కథను చక్కగా రాశారు.

– కె.నల్లప్ప,
హిందూపురం, అనంతపురం జిల్లా

అతి రహస్యం..

మూసివుంచిన గుప్పెట్లో-

రాళ్ళుండవచ్చు. రతనాలుండవచ్చు!

ఏమున్నాయో తెలుసుకోవాలనే కోరిక-

మూసిన గుప్పెటమీదే వుంటుంది!

గుప్పెట మూసి వున్నంత వరకే గుట్టు. పెద్దపట్టు. గొప్ప సస్పెన్సు. తెరుస్తే - కథ కంచికెళ్ళిపోతుంది!

తెరిచిన గుప్పెట్లో -

రాళ్ళుంటే ఛీ పొమ్మంటాం!

రతనాలుంటే చేతులు జోడిస్తాం!

అంచేత-

ఎప్పటికప్పుడు గుట్టుగా వున్నప్పుడే అడుగడుక్కీ కథ రక్తికడుతుంది. అనేకానేకమైన ఆలోచనలతో రకరకాల మలుపులు తిరుగుతుంది!

ముగింపేమిటో ముందే తెలిసిన కథకి-

ముక్తాయింపులెందుకు? మూసిపెట్టడాలెందుకు?

అందుకే చెబుతున్న కథ రక్తికట్టేందుకు ముగింపు భద్రంగా దాచుకుంటాం. అది రూలు!

ఈ రూలు కేవలం కథలకే పరిమితమనుకోడం పొరబాటు. రేపు ఏం జరుగుతుందో మనకి ఇవాళే తెలీదు. లాటరీలో లక్షలు తగలొచ్చు. వ్యాపారంలో నెత్తిమీద ముసుగు చోటు చేసుకోవచ్చు. అదీ ఇదీ కాదనుకుంటే బాల్చీ తన్నేసిన కారణంగా మన బతుక్కి శుభం కార్డు పడొచ్చు!

ఆ వివరం ముందే తెలిసిపోతే థ్రిల్లేముంటుంది?

థ్రిల్లు విషయం గాలికొదిలేయండి. జరగబోయే ముచ్చట్లు ముందే తెలిసిపోడం వల్ల - నడుస్తున్న వర్తమానం నీరసంగా తగలడుతుంది. బతుకుమీద బోర్ కొడుతుంది!

ఆషామాషీ వ్యవహారాలు ముందే అల్లరైనా ఫర్లేదు. రేపు ఒక పూటే భోజనమని ఇవాళే తెలిసినా అయ్‌సీ అని సరిపెట్టుకుంటాం!

నాకు వీలవదని ఆత్మారాముడు గోలచేస్తే - రేపు పస్తుండబోయే పూట భోజనం - ముందస్తు చర్యగా ఇవాళే ముగించుకుని మూతితుడుచుకుంటాం!

ఎటొచ్చీ -

గుట్టుగా వుంచిన విషయమ్మీదే ఇంట్రెస్టు అపారంగా పెరిగిపోతుంది! అయితే - అతి రహస్యం బట్టబయలు అనే సిద్ధాంతం వల్ల బతికిపోతున్నాం!

ఎంతో గుట్టుగా జరిగే బదిలీలూ ప్రమోషన్లు - పైవాడి సంతకం కాకుండానే అల్లరై పోతుంటాయి. ఎంతో రహస్యంగా సాగిన ఈ వ్యవహారం ఎట్లా బజారున పడిందో తెలిస్తే పైవాడి గుండె పచ్చడవుతుంది!

ఆ వివరాలు విడిచి పెట్టండి!

ఈ సంచికలో . . .

ఔరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 6
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

మంచి ముత్యాల దండ
కథ ... 9

దొడ్డికొమరయ్య బలిదానం
రియల్‌స్టోరీ...14, 15



మధుర మీనాక్షి
టూరిస్ట్ గైడ్ . . . 21

మ్యాజిక్ స్టిక్ మనోహర్
కళాసాహితి . . . 22, 23

కథా నిలయం

భాషల్లో బాతుల భాష వేరట?!



మానవులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో భాష మాట్లాడుతారు. చిలకలు కూడా ఏ భాషవారి వద్ద వారి భాషలో మాటలు పలకడం మనం చూస్తుంటాము. అలాగే కొన్ని పెంపుడు జంతువులు మనిషి భాషను అర్థం చేసుకుని తదనుగుణంగా వ్యవహరిస్తాయి. ఒకేజాతికి చెందిన జంతువులు, పక్షుల అరుపులు, కూతలన్నీ మనకు ఒకేలా వినిపిస్తాయి. కాని బాతులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా తమ భావాలను వెల్లడిస్తాయని మిడిల్‌సెక్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులు చెబుతున్నారు. లండన్‌లో ఉన్న బాతులు, ఇంగ్లాండ్‌లోని ఇతర ప్రాంతాల్లోని బాతుల మధ్య సంతోషం, బాధకు సంబంధించిన అరుపుల్లో చాలా వ్యత్యాసం ఉన్నదని, కొన్ని సందర్భాల్లో అసలు పోలికే ఉండటం లేదని అనేక సంవత్సరాల పాటు పరిశోధనలు జరిపిన అక్కడి శాస్త్రవేత్తలు తేల్చారట?! అదేవిధంగా ఇంగ్లాండ్‌లోని బాతులకు ఇతర దేశాల బాతులకు కూడా ఈ అరుపుల్లో వ్యత్యాసం ఉన్నదని వారు చెబుతున్నారు.

చిన్న కుటుంబం చింతలేని కుటుంబం

అమెరికాలోని ఓ స్వచ్ఛంద సంస్థకు మధ్యప్రదేశ్‌లోని గ్రామీణ పేద ప్రజలపైనా, మనదేశంలో కుటుంబ నియంత్రణ పాటించాల్సిన అవశ్యకతపైనా హఠాత్తుగా ప్రేమ కలిగింది. వెనువెంటనే ఒక కార్యక్రమం చేపట్టింది. చింద్వారా జిల్లాలోని గ్రామాల్లో తన కార్యకర్తల ద్వారా కొత్తగా పెళ్ళయిన పేద మహిళలకు, చిన్న కుటుంబంతో సరిపెట్టుకున్న దంపతులకు నెలకు రు. 250లు పంపిణీ చేయిస్తున్నది. అంతేగాకుండా గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా ఉచిత వైద్య పరీక్షలు చేయిస్తూ, జనాభా నియంత్రణ గురించి, చిన్న కుటుంబమే చింతలు లేని కుటుంబం అంటూ ప్రచారం చేస్తోందట! ఆ అమెరికా సంస్థకు అక్కడి ప్రజల మీద ఇంతగా జాలి, అభిమానం కలగడానికి కారణం ఏమై ఉంటుందో?

ఇదో వ్యాపార కళ!?

వ్యాపారం చేసేవాళ్ళు కస్టమర్లను ఆకర్షించడానికి రకరకాల మార్గాలు అవలంబిస్తారు. వ్యాపార స్థాయిని బట్టే ఎత్తులు, జిత్తులు కూడా ఉంటాయి. ఢిల్లీలో గత నెలలో కొత్తగా భారీఎత్తున ఒక వజ్రాల షోరూమ్‌ను తెరిచారు. అమితాబ్ బచ్చన్, ఊర్మిళ వంటి బాలీవుడ్ తారల తళతళల నడుమ ఆ షోరూమ్ ఓపెన్ అయింది. ఇక్కడ విశేషమేమంటే ఆ షోరూమ్‌లో వజ్రాలు కొనడానికి ఎవరంటే వారు, ఇష్టం వచ్చినట్లు లోపలికి వెళ్లడానికి వీల్లేదట?! వజ్రాలు కావలసిన వారు షోరూమ్‌కు ఫోన్ చేస్తే స్వయంగా దాని యజమాని ఉపేంద్రకుమార్ శర్మ ఒక విలాసవంతమైన కారును కస్టమర్ ఇంటికి పంపిస్తారు. ఆ కారులో వచ్చి షోరూమ్‌లో తమకు కావలసిన వజ్రాలు కొనుగోలు చేస్తే అదే కారులో తిరిగి వారిని వారి ఇంటికి చేరుస్తారట? కోట్ల రూపాయల విలువైన తన వజ్రాల షోరూమ్‌ను మోసకారులు, దొంగల బారి నుండి కాపాడుకోవడానికి శర్మగారు కస్టమర్లను విఐపీలుగా పరిగణించే ఈ వ్యాపారకళ అమలు చేస్తున్నారట?



కార్టూన్ కదంబం

నో కామెంట్ బిడ్డా!
ప్రత్యేక తెలంగాణ
కెసిఆర్
నారు
రంగంలో తెలంగాణ తెలంగాణానికి దాటువేసిన అమ్మవారు
తెలంగాణపై సోనియా హామీ ఇవ్వలేదు -వైఎస్



రైల్వే స్టేషన్
రైళ్ల భద్రత గురించి కాదట మన భద్రత గురించట!
ప్రయాణీకుల భద్రతకు అధిక ప్రాధాన్యం: లాలూ



ఆగండి అటల్‌జీ! 7 రేస్ కోర్స్ రోడ్డుకు ఏదైనా సబ్‌వే గురించి ఆలోచిస్తున్నా!!
ఐదేళ్లలోపే మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తాం: అద్వానీ

నేర్పుతాం ఇంగ్లీషు ఈజీగా,
మాట్లాడండి ఇక దాన్ని హాయిగా!

ఎలా అంటారా? ఎంతో లేదండీ కేవలం 750 ఇంగ్లీషు పదాలు తెలుసుకుంటే చాలు. మీరు రోజూ మాట్లాడే సంభాషణలను అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడవచ్చు.

ఇప్పటికే ఇందులోని కొన్ని పదాలను మీకు తెలియకుండానే మీరు ఉపయోగిస్తున్నారు.

ఇక సందర్భానుసారంగా ఏ ఏ పదాలను ఎలా ఎక్కడ అర్థమయ్యేలా ఉపయోగించాలో నేర్పించటమే మా వంతు. ఇది తెలుసుకుంటే చాలు. మీరు కూడా హాయిగా ఇంగ్లీషులో మాట్లాడగలుగుతారు.

దీనికనుగుణంగా ఈ శిక్షణను గత **23** సంవత్సరాలుగా మేము అందిస్తున్నాం.

మరో విశేషమేమిటంటే ఈ శిక్షణ విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు మరియు గృహిణులు ఇలా అన్ని రంగాల వారికి ఎంతో ఉపయోగకరం.

శిక్షణ పాఠాలను మీ తీరిక వేళలో శ్రద్ధగా ప్రతిరోజు ఒక అరగంట మాత్రం చదివి ప్రాక్టీసు చేస్తే చాలు. 60 రోజులలో మీరు కూడా సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం ప్రారంభిస్తారు.

ఈ శిక్షణ ద్వారా ఇప్పటికే **16** లక్షలకు పైబడినవారు ఇంగ్లీషులో సరళంగా మాట్లాడే అవకాశం పొందగలిగారు. ఇక ఇప్పుడు ఈ అవకాశం మీకే !

దీనికి మీరు చేయవలసిందల్లా ఒక్కటే. క్రిందవున్న కూపను పూర్తి చేసి పంపండి. శిక్షణకు కావలసిన పాఠాల ప్యాకేజ్ **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తుంది.

మరచిపోకండి. కూపను వెంటనే పంపండి.

ఇదిగో కూపన్

Yes! నేనూ ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి రూ. **575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

పేరు: ....

వయసు: .... ఆడ ☐ మగ ☐

చిరునామా: ....

....

.... పిన్‌కోడ్..............

VIVEKANANDA INSTITUTE

9, Madley Road, T.Nagar, Chennai-600017.

PS-1

VIVEKANANDA INSTITUTE

INDIA'S No.1 ENGLISH TRAINING INSTITUTE

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R.NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. VANASTHALIPURAM ☎ 24122464. MEHDIPATNAM ☎ 55755888. A.S.RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎ 2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎ 248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.

08/TEL/04/NAGA



మేఘ మథనం

మేఘాలు కనిపించి మురిపిస్తున్నాయేగాని పుడమిపై కరుణించడంలేదు. వరుస దుర్భిక్షాలతో రాష్ట్రంలోని రైతాంగం నానా అగచాట్లు పడుతోంది. తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. భూగర్భ జలాలు మనిషి టెక్నాలజీకి అందనంత లోతుకెళ్ళిపోయాయి. ఈ పరిస్థితి భూగోళమంతా ఉంది. అందుకే అనాదిగా మానవుడు కురవని మేఘాలను వర్షింపచేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కొద్ది కొద్దిగా విజయం సాధిస్తున్నాడు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం కృత్రిమ వర్షాలపై ఆశలు రేకెత్తిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కృత్రిమ వర్షాలు కురిపించే ప్రక్రియ మేఘ మథనంపై ప్రత్యేక కథనం....

కె.ఎస్.వి.ప్రసాదరావు

కృత్రిమ వర్షాలు కురిపించే ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభం కాబోతోంది. తర్జన భర్జనల అనంతరం మేఘ మథనానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. గతంలో కూడా ప్రయోగాలు జరిగినప్పటికీ వాటికి దిశ నిర్దేశం లేకుండా పోయింది. అనావృష్టి ప్రాంతాల అభివృద్ధి కోసం శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ఎడారిలో ఒయాసిస్‌లా మేఘమథనం కనబడుతోంది. వరుస కరువులు రాష్ట్రాన్ని పట్టి పీడిస్తుండటంతో చుక్క నీరు దొరుకుతుందనుకున్నా అందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ మేఘ ప్రయోగాలతో చినుకు పడుతుందా అనేది ఎందరిలోనో నెలకొన్న సందేహం. ఇంతకీ ఈ ప్రయోగాలు సఫలమై వానలు పడతాయా? ఒక వేళ కురిస్తే అవి మేఘ మథనం వల్లేనని రూఢీగా ఎలా చెబుతారు? ఇన్ని అనుమానాల మధ్య అంత ఖర్చు చేయడం అవసరమా? అంటూ రకరకాల ప్రశ్నలు అధికారులు, శాస్త్రవేత్తల మెదళ్లను తొలుస్తున్నాయి. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వివిధ ప్రాంతాల్లో కృత్రిమ వర్షాలు కురిపించడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని వార్తలొస్తున్నాయి. కృత్రిమ వర్షాలు కురిపించడానికి శాస్త్రవేత్తల ప్రయత్నాలు వాస్తవానికి యాభై ఏళ్ల క్రితమే ప్రారంభమయ్యాయి. అంతకు ముందు కూడా ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. 1922లో దక్షిణాఫ్రికాలో తొలి ప్రయోగం జరిగిందని, విమానాల ద్వారా ఉప్పు పొడిని మేఘాల్లో చల్లడం ద్వారా వర్షాలు కురిపించారని ఆ రంగంలో పరిశోధనలు జరుపుతున్న 'సౌత్ ఆఫ్రికన్ వెదర్ సర్వీస్' అనే సంస్థ ప్రకటించుకుంది. అయితే 1947-1948 ప్రాంతంలో దక్షిణాఫ్రికా చేసిన ప్రయోగాలు అమెరికాను అమితంగా ఆకర్షించాయని, ఆ తర్వాత అమెరికా ఈ రంగంలో పరిశోధనలు ప్రారంభించిందని ఆ సంస్థ పేర్కొంది. నిరంతర ప్రయోగాలకు రాడార్, ఎయిర్ క్రాఫ్ట్, పర్యవేక్షణ, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర సౌకర్యాలు ఆ దేశంలో ఏర్పాటయ్యాయి. ప్రయోగాల వల్ల సాధారణ వర్షపాతం కంటే ఏడు శాతం అధికంగా నమోదైనట్లు అక్కడి రికార్డులు చెబుతున్నాయి. 20 శాతం వరకు అధికంగా వర్షపాతం మేఘ మథనం వల్ల నమోదైందని 'కౌంటి ఆఫ్ సక్త బార్బర' అనే సంస్థ తెలిపింది. 1948 నుండి ఆ సంస్థ ప్రయోగాలు చేస్తోంది. ఒక ఎకరం పరిధిలో అడుగు భూగర్భ జలాలను పెంచడానికి 100 డాలర్లు ఖర్చవుతుందని తెలిపింది. దీన్ని బట్టి వైజ్ఞానికులు తమ పరిశోధనల్లో గణనీయమైన పురోగతి సాధించారని అర్థమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో కృత్రిమ వర్షాల ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయనే చెప్పాలి. రష్యాలో అయితే ఈ ప్రయోగాల ద్వారా సాలీనా వచ్చే వర్షపాతాన్ని అతి తక్కువ ఖర్చుతో బాగా పెంచడమే కాకుండా విమానాశ్రయాల్లో తరచూ రాకపోకలకు అవాంతరాలను కలిగించే దట్టమైన పొగమంచును పూర్తిగా నిర్మూలించడానికి కూడా ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మేఘ మథనం ప్రారంభమైన నాటి నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఉపయోగం ఉందా? లేదా? అనే సంవాదం నడుస్తూనే ఉంది. కృత్రిమ వర్షాల కోసం ప్రయోగం అంటే రసాయనాలను విమానాల్లో తీసుకెళ్లి మేఘాల్లో చల్లడం. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్నదనేది ప్రధాన విమర్శ. వెయ్యి లీటర్ల వర్షపు నీటి కోసం కేవలం 75 పైసలు మాత్రమే ఖర్చు అవుతుందనేది మరో వాదన. ప్రయోగం వల్ల లాభ నష్టాలను బేరీజు వేయడానికి ఇప్పటి వరకు మన ప్రభుత్వం పూనుకోలేదు. అధ్యయనం చేయలేదు. దక్షిణాఫ్రికా సంస్థ ప్రచారం ఎలా ఉన్నా 1948 నుంచే కృత్రిమ వర్షాలపై ప్రయోగాలు, పరిశోధనలు ఇజ్రాయిల్‌లో ప్రారంభమయ్యాయని, వాటి ఫలితాల సరళి వెల్లడయ్యాక అమెరికా, కెనడా, మెక్సికో, అర్జెంటీనా, ఫ్రాన్స్, దక్షిణ ఆఫ్రికా, ఉక్రెయిన్, థాయిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలూ దృష్టి సారించాయని అందుబాటులో వున్న సమాచారం వల్ల అవగతమవుతోంది. కొలరాడో ప్రాంతంలో మేఘ మథనం వల్ల 34 శాతం మేరకు వర్షపాతం పెరిగిందని నమోదైంది. మన పొరుగున ఉన్న చైనాలోని జియాంగ్సూ ప్రాంతంలో కృత్రిమ వర్షాల కారణంగానే 13 లక్షల హెక్టార్లలో పంటలు నిలబడ్డాయని వార్తలొస్తున్నాయి. ఇక మన దేశంలో ఉన్న పూణెలో ఉన్న భారతీయ ఉష్ణ మండల వాతావరణ సంస్థ శాస్త్రవేత్తలు 1973 నుండి 1986 వరకు నైరుతి రుతుపవనాల్లో వచ్చే ఉష్ణ మేఘాలను కృత్రిమ వర్ష

మేఘ మథనం ఎలా సాగుతుంది?





సూర్య కిరణాలకు భూమి వేడెక్కుతుంది. తర్వాత భూమిపైన ఉన్న గాలి వేడెక్కి చెరువులు, నదులు, సముద్రాలలో ఉన్న నీరు సూర్యరశ్మికి ఆవిరిగా మారి గాలితో ఆకాశంలోకి పోతుంది. భూమి నుండి ప్రతి కిలోమీటరు ఎత్తుకు పోయేకొద్దీ 6 నుండి 10 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తగ్గుతుంది. భూమి నుండి ఆకాశంలోకి పోయేకొద్దీ వాయు పీడనం క్రమంగా తగ్గుతుండటం వల్ల నింగికెగిసే గాలి పుంజాలు వ్యాకోచించి చల్లబడతాయి. భూమి మీద 30 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండగా 75 శాతం ఆర్ద్రత కలిగి ఒక ఘనపు మీటరుకు 20 గ్రాముల నీటి ఆవిరిని కలిగి ఉన్న గాలి పుంజం ఆకాశంలో ఒక కిలోమీటరు ఎత్తున 24 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత స్థాయికి చేరడంతో 19 గ్రాముల నీటి ఆవిరిని ఇముడ్చుకొని మిగతా ద్రవాన్ని ధూళి కణాలపై ద్రవింపజేయడంతో మేఘ బిందువుగా రూపొందిస్తుంది. దాదాపు 10 మైక్రానుల సైజు ఉండే (తల వెంట్రుక మందం 75 మైక్రానులు) జల బిందు రాశులతో మేఘం ఏర్పడుతుంది. ఈ మేఘ బిందువులు 250 మైక్రానుల వరకు పెరిగితే తుంపర జల్లులు, ఆ పైన 500 నుండి 5 వేల మైక్రానుల వరకు పెరిగితే పెద్ద వర్ష బిందువులతో భారీ వర్షాలు కురుస్తాయి. మేఘంలో నీరు ఘనీభవించే స్థాయికి పోలేక మేఘ శిఖరాలు మూడున్నర నుండి ఐదున్నర కిలోమీటర్ల స్థాయిలో ఉంటే వాటిని ఉష్ణమేఘాలంటారు. మేఘాల శిఖరాలు నీరు ఘనీభవించే స్థాయికి దాదాపు ఆరు నుంచి పది కిలోమీటర్లు ఇంకా అంతకుమించి ఉంటే వాటిని శీతల మేఘాలంటారు. వీటిలో దట్టమైన కారు మబ్బులుంటాయి. మేఘాల ఆయుర్దాయం సగటున అరగంట నుండి గంట వరకు ఉంటుంది. భారీ స్థాయిలో భూమి నుండి తేమను మేఘాల్లోకి తీసుకెళ్లే ఉధృతమైన గాలులున్నప్పుడు మేఘాల ఆయుర్దాయం బాగా పెరుగుతుంది. మామూలుగా లభించే కేంద్రకాల వల్ల గర్భధారణ పొందే మేఘాలు 20 నుండి 40 శాతం వరకు గత తేమను వర్ష రూపంలో ఇస్తాయి. వర్షపాతాన్ని మరింత ఎక్కువగా పొందాలంటే పశువుల్లో కృత్రిమ గర్భధారణ చేయించి మేలిమిజాతిని పొందినట్లు మేఘాల్లో కొన్ని రసాయనాలను వాడి ఆ మేఘం ఎత్తు, పొడవు, వెడల్పులను పెంచి దరిదాపుల్లో ఉన్న మేఘాలను కూడా కలుపుకొని అనేక రెట్లు ఎక్కువ నీటిని వర్షింపజేయవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కృత్రిమ వర్ష ప్రయోగాలు చేయకపోతే కొన్ని కారుమబ్బులు కూడా వర్షించకుండా అదృశ్యమయ్యే అవకాశం ఉంది. రష్యాలో జరిపిన ప్రయోగాల్లో మేఘం సైజు పెరిగి 7 లక్షల టన్నుల వర్షాన్ని ఇచ్చిందట. కాలిఫోర్నియాలో కొన్ని నదుల పరీవాహక ప్రాంతాల్లో నీటి పరిమాణం 13 శాతం పెరిగిందని, ఇజ్రాయిల్‌లో అయోడైడ్ స్ఫటికాలను మేఘాల్లో చల్లడం వల్ల నీటి పరిమాణం పెరిగినట్లుగా ఆధారాలున్నాయి. ఆ దేశంలో వాడే నీటిలో మూడవ వంతు శీతల మేఘాలపై విమానాల ద్వారా సిల్వర్ అయోడైడ్ చల్లి పొందుతున్నదేనట. కృత్రిమ వర్ష ప్రక్రియ ద్వారా మేఘం ఎత్తులో 10 డిగ్రీల సెంటిగ్రేడు ఉష్ణోగ్రత వద్ద శీతలీకరణ చెందిన జలవనరుల్లో లీటరుకు వంద నుండి ఐదారు వందల వరకు ఐసు కేంద్రాలను పోలిన సిల్వర్ అయోడైడ్‌ను విమానాల ద్వారా మేఘం పైభాగంలో లేక అడుగు భాగంలో కూడా చల్లవచ్చు. తక్కువ ఖర్చులో పరిమితమైన ప్రయోజనాన్ని పొందాలంటే కావలసిన చోట్ల భూమిపై కొలిమి పెట్టి దాంట్లో రాక్షసి బొగ్గు తెల్లగా 1200 డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణంతో మండుతుండగా ఆ బొగ్గుల కుంపటిపై ప్రతి నాలుగైదు నిమిషాలకు 7 నుండి 9 గ్రాముల టెక్నికల్ గ్రేడ్ సిల్వర్ అయోడైడ్ పొడిని చల్లుతుంటే వచ్చే రంగు పొగలు ఆకాశంలోని మబ్బుల్లోకి ప్రవేశించి శీతల మేఘ బిందువుకు ఐసు కేంద్రకాలుగా పని చేస్తాయి. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే ఇది సత్ఫలితాలనిస్తుంది.





ప్రయోగాలకు గురి చేశారు. విమానాల ద్వారా ఉప్పు నీటిని చల్లి సాలుసరి వర్షపాతాన్ని 25 శాతం అధికం చేశారు. చవకగా వెయ్యి లీటర్ల నీటిని ఒక పైసా ఖర్చుతో మేఘాల నుండి వర్షింపజేశారు. ముంబయి నగరానికి నీరందించే రిజర్వాయర్ 'వైతరణి' కోసం ఇదివరకు పన్నెండు పర్యాయాలు కృత్రిమ వర్షాలకు ప్రయత్నిస్తే పదకొండు ప్రయోగాలు విజయవంతమయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని ప్రాంతాల్లో మేఘ మథనం నిర్వహించింది. కర్నాటక కూడా అదే మార్గంలో ఇప్పటికే పయనిస్తోంది. అక్కడ ప్రయోగాలు జయప్రదమయ్యాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు ప్రకటించారు.

మన రాష్ట్రంలో కృత్రిమ వర్ష ప్రయోగాలను 1993 జులైలో హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించగా ఉస్మాన్‌సాగర్‌లో రెండడుగుల నీటి మట్టం పెరిగిందని అధికారులంటున్నారు. ఉస్మాన్‌సాగర్‌కు ఆనుకొని ఉన్న హిమాయత్‌సాగర్‌లో అదే సమయంలో ఒక్క చినుకు వర్షం పడలేదంటున్నారు. వర్షపునీటి నమూనాలను పరీక్షకు పంపగా దాంట్లో సిల్వర్ రసాయనం కొద్ది మోతాదులో



దశల వారీగా మేఘ మథనం

మారెప్ప

రాష్ట్రంలో దశల వారీగా మేఘ మథనం నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని అనావృష్టి ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి ఎం మారెప్ప చెప్పారు. కృత్రిమ వర్షాల ప్రయోగం వివరాలు మంత్రి మాటల్లో... తొలి దశలో అంటే ఈ సంవత్సరం ఏడు జిల్లాల్లో కృత్రిమ వర్షాల ప్రయోగం చేస్తున్నాం. తొలి ప్రయోగాన్ని కర్నూలు జిల్లాలోని నంద్యాలలో నిర్వహించాలని నిర్ణయించాం. అక్కడ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జులై రెండో వారంలో ప్రయోగం చేస్తాం. నాలుగైదు దశాబ్దాలుగా సగటున 600 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాలను గుర్తించాం. రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, తెలంగాణాలోని నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో తొలి దశలో మేఘ మథనం జరుగుతుంది. ఫలితాలు ఆశాజనకంగా ఉంటే మిగిలిన జిల్లాల్లో కూడా ప్రయోగం చేస్తాం. కృత్రిమ వర్షాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 11.60 కోట్ల రూపాయలను ఇప్పటికే విడుదల చేసింది. వరుస కరువులను దృష్టిలో పెట్టుకొని కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనావృష్టి ప్రాంతాల అభివృద్ధికి ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసింది. ఆ శాఖ మేఘ మథనం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తోంది. 250 కిలోమీటర్ల పరిధిలో వర్షాలు పడే విధంగా మేఘ మథనం జరుగుతుంది. రసాయన పదార్థాలను విమానాల ద్వారా మేఘాల్లో చల్లడం ప్రయోగంలోని ముఖ్యాంశం. పదేళ్ల క్రితం రాష్ట్రంలో కృత్రిమ వర్షాల కోసం ప్రయత్నించినప్పుడు అంతగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందలేదు. గత ఏడాది మేఘ మథనం కాలం గడిచిన తర్వాత లాంఛనంగా జరిగింది. ప్రస్తుతం పరిజ్ఞానంలో వేగంగా మార్పు లొచ్చాయి. మహారాష్ట్ర, కర్నాటకలో కృత్రిమ వర్షాల కోసం చేసిన ప్రయోగాలు విజయవంత మయ్యాయి. ఆ రాష్ట్రాల్లో ప్రయోగం చేసిన అనుభవం ఉన్న సంస్థలకే కాంట్రాక్టు ఇచ్చాం. గ్లోబల్ టెండర్లు పిలిస్తే ఒక్క సంస్థ మాత్రమే టెండర్ వేసింది. దానికే కాంట్రాక్టు అప్పగించాం. రాష్ట్రంలో కూడా ప్రయోగం ఫలప్రద మవుతుందన్న విశ్వాసం ప్రభుత్వానికుంది. అనేక కోణాల్లో ఆలోచించిన తర్వాతే మేఘ మథనానికి నాంది పలికాం. వెచ్చించే నిధులు వృథా కాబోవన్న నమ్మకం ఉంది.

ఉందని నిర్ధారణ అయినట్లుగా రికార్డులున్నాయి. 1995 జులై, ఆగస్టు మాసాల్లో కృత్రిమ వర్షాల ప్రయోగం వల్ల ఆశించిన స్థాయి కంటే కొంచెం ఎక్కువగా వర్షం నమోదైనట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం విశాఖపట్నంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రయోగంలో ఉష్ణ మేఘాలు మథించడానికి ఉప్పు పొడిని చల్లడం, శీతల మేఘాలను మథించడానికి సింహాచలం కొండలపై కొలుములు ఏర్పాటు చేసి రాక్షసి బొగ్గును మండించి సిల్వర్ అయొడైడ్ రసాయన పొడిని చల్లడం వల్ల దాదాపు గంటలోపు భారీ వర్షాలు పడ్డాయి. వర్షపు నీటిని పరీక్షించగా సిల్వర్ అయొడైడ్ ఉన్నట్లు తేలింది. మన రాష్ట్రంలో మేఘ మథనం ఉదాహరణలివే. చంద్రబాబు ప్రభుత్వం గత సంవత్సరం అనంతపురం జిల్లాలో లాంఛనంగా జరిపిన మేఘ మథనం మాత్రం అంతగా ఉపయోగ పడలేదు.

రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిపిన ప్రయోగాలపై నిర్దిష్టంగా అధ్యయనం చేయలేదనేది నిపుణుల అభిప్రాయం. 1995లో రంగారెడ్డి జిల్లా చేవేళ్ల ప్రాంతంలో జరిపిన ప్రయోగాలకు సారథ్యం వహించిన ప్రముఖ ఇంజనీర్ టి హనుమంతరావు అప్పటి వివరాలను గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. శీతల మేఘ మథనం చేశామని, భూమిపై కొలిమి పెట్టి సిల్వర్ అయొడైడ్, సిల్వర్ నైట్రేట్‌లను వాడి పొగ వచ్చేలా చేశామని ఆయన వెల్లడించారు. అర్థాంతరంగా దాన్ని ప్రభుత్వం ఎందుకు నిలిపి వేసిందో తెలీదు. అప్పుడు ప్రయోగాలు చేసిన తర్వాత కొద్దిమేర వర్షాలు పడ్డాయి. ప్రయోగాల వల్ల వర్షాలు పడ్డాయా అనే విషయంపై దృష్టి పెట్టలేదు. పొగ పెట్టడం వల్ల వర్షాలు పడతాయన్నదానికి శాస్త్రీయత లేదని ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుపుతున్న శాస్త్రవేత్తలంటున్నారు. విమానాల ద్వారా నేరుగా ప్రయోగం చేయడమే శాస్త్రీయమని వారంటున్నారు. అయితే ఇది అత్యంత ఖరీదైంది. రిస్క్‌తో కూడుకున్నది. హడావుడిగా చేసేది కాదని, బోల్డంత కసరత్తు అవసరమనేది నిపుణుల అభిప్రాయం. విమానాల ద్వారా శీతల మేఘ మథనం మరింత ఖర్చుతో కూడిన వ్యవహారం అయినందున వెచ్చటి మేఘాలనే ఎంచుకోవాలి. తేలిక రకం ఎయిర్‌క్రాఫ్టులను

నేల నుండి మేఘమథన ప్రయోగం

ఉపయోగించడం మేలు. సాధారణ ఉప్పు, సుద్దపొడి కలిపి మేఘాల్లో నేరుగా చల్లాలి. ఈ ప్రక్రియలో విమానాలను మేఘంలోకి తీసుకెళ్లడం కొద్దిగా ప్రమాదకరం. పైలెట్‌కు అనుభవం ఉండాలి. అంతర్జాతీయంగా ఉన్న కొన్ని సంస్థలు మేఘ మథనం కోసం ప్రత్యేకంగా ఎయిర్‌క్రాఫ్ట్‌లను రూపొందించాయి. ఒక చోట ప్రయోగానికి అన్ని ఖర్చులతో కలుపుకొని 25 లక్షల వరకు వ్యయమవుతుందనేది మన నిపుణుల అంచనా. పరికరాలకోసం మరో పది లక్షలు అవసరమవుతాయి. పరికరాలు పర్మినెంట్‌గా ఉంటాయి. ఎయిర్‌క్రాఫ్ట్‌లకు వసూలు ఛార్జీయే కీలకం. కొన్ని సంస్థలు తమకు అనుభవం ఉందన్న పేరుతో కోట్ల రూపాయలను వసూలు చేస్తున్నాయి. అయితే ప్రయోగాలు ఒకసారి చేస్తే సరిపోదు. ఐదేళ్లు వరుసగా చేయాలి. రాష్ట్రంలో ఏడు వేర్వేరు వాతావరణ పరిస్థితులున్న ప్రాంతాల్లో చేయాలి. ఇది అధ్యయనానికి ఉపయోగ పడుతుంది. ఏ సమయంలో ప్రయోగాలు చేస్తే వర్షాలు పడతాయి? ఏ మేఘాలను ఎంపిక చేసుకోవాలి? అనే అంశాలపై ఇంకా నిర్దిష్టమైన సమాచారం లేనందున అధ్యయన స్థాయిలోనే ప్రయోగాలున్నాయనేది గమనించాల్సిన అంశం. 1600 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఎంచుకొని అక్కడ మేఘమథనం చేయాలి. దీన్ని గ్రిడ్ అంటారు. గాలివాటును బట్టి ఈ గ్రిడ్ తర్వాత ఉండే మరో 1600 కిలోమీటర్ల ప్రాంతాన్ని బఫర్ అంటారు. దీని తర్వాత ఉండేది కంట్రోల్ ప్రాంతం. రాడార్ దీన్ని కంట్రోల్ చేస్తుంది. 16 ప్రాంతాల్లో రెయిన్‌గేజ్‌లను ఏర్పాటు చేసి వర్షాలు పడిన తర్వాత ఆటమిక్ మైక్రోస్కోపుతో పరీక్షించాల్సి ఉంది.

మేఘ మథనంపై గత ఏడాది అధ్యయనం చేసిన అధికారులు అది ఉపయోగ పడదని ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కొద్ది ప్రాంతంలో మాత్రమే వర్షాలు కురిపించడం సాధ్యమని, మేఘమథనం ప్రభావం చాలా తక్కువని తేల్చారు. ప్రత్యేక విమానాలు అమెరికా, అబుదాబీలో మాత్రమే ఉన్నాయని రిపోర్టు ఇచ్చారు. పూణెలోని వాతావరణ సంస్థ మేఘ మథనాన్ని శాస్త్రీయంగా గుర్తించలేదని, అసలు ఆ విధంగా సిఫారసు చేయడం లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ కమిషనర్ సుతీర్థ భట్టాచార్య గతంలో వెల్లడించారు. పూణె సంస్థ మేఘ మథనంపై అర్థం లేని అనుమానాలను వ్యక్తం చేస్తోందని నిపుణుల అభిప్రాయం. ఈ విధంగా మథనం అనే అంశం వివాదాస్పదం అయింది. ప్రపంచవ్యాప్తంగా అనావృష్టి పరిస్థితులు అనేక ప్రాంతాల్లో చోటుచేసుకోవడంతో మేఘమథనానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ రంగంలో తాము నిష్ణాతులమన్నట్లు అంతర్జాతీయ స్థాయిలో కొన్ని సంస్థలు ప్రకటించుకున్నాయి. ప్రచారం ఊపందుకుంది. కేవలం మేఘమథనం సమాచారం తెలిపే వంద వెబ్‌సైట్లు వెలిశాయి. లాభసాటి వ్యాపారంగా తలచి కొన్ని సంస్థలు మేఘమథనానికి అవసరమైన ప్రత్యేక ఎయిర్ క్రాఫ్ట్‌లను, ఇతర పరికరాలను తయారు చేస్తున్నాయి. పలు దేశాల నుండి ఆయా సంస్థలకు టెండర్లు లభిస్తున్నాయి. ఆయా సంస్థల వినియోగదారుల జాబితాలో మన రాష్ట్రం కూడా చేరింది. ◆

మంచి ముత్యాల దండ

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

పన్నని మట్టి రోడ్డు నుంచి చూస్తుంటే దూరంగా పాత పెంకుటిల్లు కనిపిస్తోంది. చుట్టూ ప్రహరీ... చిన్నగేటు ఇంటిముందు పూల మొక్కలు...వెనుక పెరటి తోటలు... ఊరికి దూరంగా ప్రశాంత వాతావరణంలో ఒంటరిగా ఉంది.

రేవతి గేటు తీసుకుని లోపలికి వెళ్ళింది.

"ఎవరూ?" లోపలి నుంచి పిలుపు. రేవతి జవాబు చెప్పకుండా చేతిలో సూటుకేసు కింద పెట్టింది. మొహానికి పట్టిన చెమటను తుడుచుకుంది.

"నేను..." రేవతి నోట్లోంచి మాట రాకముందే ఓ వృద్ధుడు తలుపు తీసి బైటికి వచ్చాడు. ఆ అమ్మాయిని తేరిపార చూసి – "నువ్వేనా రేవతివి?" ప్రశ్నించాడు.

రేవతి ఉలిక్కిపడింది.

ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే – "మన సరస్వతి ఫ్రెండు రేవతి వచ్చింది!"

అరుపులాంటి పిలుపు పిలిచి ఆమె సూటుకేసును అందుకుంటూ "రామ్మా! లోపలికి!" అంటూ దారి తీశాడు.

"అబ్బాయి, కోడలు సరస్వతి అర్జెంటుగా రాజమండ్రి వెళ్ళారు. నువ్వు వస్తావని సరస్వతి చెప్పింది!" వరండాలోకి తీసుకెళ్ళాడు. సరస్వతి అత్తగారు రామలక్ష్మి రాగిచెంబుతో నీళ్ళు ఇచ్చి కాళ్ళు కడుక్కోమంది. ఆయన తువ్వాలు అందించారు.

రేవతి వారి ప్రవర్తనకు ఎదురు చెప్పలేకపోయింది.

ఇల్లు పొందికగా ఉంది. వస్తువులన్నీ నీటుగా సర్ది ఉన్నాయి. మడత మంచం... వాలు కుర్చీ.. గదిలో ఓ మూల దేముడి పటాలతో ప్రార్థనా మండపం... చిన్న కర్ర బీరువాలో అందంగా పేర్చిన పుస్తకాలు...

"రేవతీ! ఇవన్నీ సోమేశ్వరరావుగారి టేస్టులే.. దేముడి గది మాత్రం నాదే.." రామలక్ష్మి చెప్పింది.

"దేముడి మండపమే కాదు... ఇంటిలోవన్నీ ఆవిడ గారివే.. ఈ మడత మంచం.. ఈ వాలు కుర్చీ.. ఆ కత్తిపీటా... గోడమీద పాత గడియారం... ఈ ఇంటి సింగారం అంతా రామలక్ష్మమ్మ గారిదే!" ఆయన మాటల్లో అదోలాంటి విరుపు రేవతికి నవ్వు తెప్పించింది.

"నావని అనుకోవడమే గాని వాడుతున్నది మాత్రం ఈయనగారే! ఎప్పుడైనా ఈ కుర్చీ వదిలిపెడితేనా? రెండు కాళ్ళూ బారజాపుకుని పేపరు పట్టుకుంటే వదలరనుకో..." "సరస్వతి అదృష్టవంతురాలు.. మంచి అత్త మామలు దొరికారు!" అనుకుంది రేవతి కుర్చీలో కూర్చుంటూ.

"అమ్మా రేవతీ! నీకు ఏ కూర నచ్చుతుందో తెలీదు. వంకాయ టమాటా కూర.. గోంగూర పప్పు కూడా చేస్తాననుకో.." వంటగదిలోకి వెళుతూ – "ఏ మాట కామాట చెప్పుకోవాలి... ఈ కూరగాయలన్నీ సోమేశ్వర రావుగారి చలవే... అనుకో..." కొంటెగా నవ్వుతూ అంది.

"రోజూ బజారు నుంచి ఆయనే

(మిగతా 15వ పేజీలో)

అంపశయ్య నవీన్



సామాజిక ఆమోదం

“అడిగినంత కట్నం తేలేదని ఓ భర్త భార్యను హత్య చేశాట్ట... ఏమిటో దారుణం?”

“అదొక్కటేనా? రోజూ ఇలాంటి దారుణాలెన్ని జరుగుతున్నాయో!”

“పదివేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఓ ప్రభుత్వోద్యోగిని ఏ.సి.బి. వాళ్ళు పట్టుకున్నార్ట....” “సముద్రంలోంచి నీటిబొట్టును తొలగించినట్లు ఒక్క ప్రభుత్వోద్యోగిని పట్టుకోవడంతో లంచగొండితనం పోతుందా?”

“కల్తీసారా తాగి ఇరవైమంది మృతి...” “ఇంకెంతమందో ఇలా చస్తూనే ఉంటారు...” “పదిమంది సెక్స్ వర్కర్ల అరెస్ట్...” “ఆశ్చర్యం ఏమీలేదు... షరా మామూలే.” “ఎయిడ్స్ రోగుల సంఖ్య భయంకరంగా పెరిగిపోతున్నది... మహారాష్ట్ర తర్వాత ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం...”

“త్వరలోనే మహారాష్ట్ర స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ఆక్రమించేస్తుంది..”

“ఇదేమిటి మీరు?... ఏ వార్త చదివి వినిపించినా ఆశ్చర్యపడటం గానీ కోపగించుకోవడం గానీ చెయ్యరేమిటి?”

“ఒకప్పుడు నీలాగే నేనూ ఇలాంటి వార్తలు చదివినప్పుడు చాలా ఆశ్చర్యపడేవాణ్ణి... ఇలాంటి వార్తలు చదివీ చదివీ చర్మం మొద్దుబారిపోయింది.”

“వరకట్నాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది కదా! కట్నం ఇచ్చినా, తీసుకున్నా చట్ట విరుద్ధమే కదా. అలాంటి వాళ్ళు శిక్షార్హులే కదా...”

“అవును...”

“లంచం ఇవ్వడంగానీ, తీసుకోవడంగానీ చట్టరీత్యా నేరమే కదా... ఇచ్చినవాడూ, తీసుకున్నవాడూ ఇద్దరూ నేరస్తులే కదా?” “అవును...”

“సారా అమ్మకాన్ని మన రాష్ట్రంలో నిషేధించారు కదా... సారాను తయారు చెయ్యడంగానీ, అమ్మడంగానీ నేరమే కదా...” “అవును.. అవును...”

“వ్యభిచారం నేరమని మనం చట్టం చేశాం కదా...” “అవును... అవును...” “ఇన్ని చట్టాలున్నా అవి అమలు జరుగుతున్న దాఖలాలు కనిపించవేమిటి?”

“అమలు జరిగితే కదా అమలు జరుగుతున్నట్టు కనిపించడం...” “తాను అమలు చెయ్యలేని చట్టాల్ని ప్రభుత్వం ఎందుకు చెయ్యాలి.. నోర్మూసుకుని కూర్చుంటే పోలా?”

“ప్రభుత్వం అన్నప్పుడు ఏదో ఒకటి చేస్తున్నట్టు నటించాలి కదా...”

“అంతేనంటారా? చట్టాలు అమలు కాకపోవడానికి ముఖ్య కారణం ఏమిటంటారు.”

‘వెనకటికొకాయన”లా ఈజ్ యాన్ యాస్ అన్నాడు అంటే చట్టం అనేదొక గాడిదలాంటిది అని ఆయన ఉద్దేశం...చట్టాన్ని ఎవడి అవసరానికి వాడు ఉపయోగించుకుంటాడు అని అర్థం. గాడిద చేత మనం అడ్డమైన పనులన్నీ చేయించుకుంటాం కదా... అలాగే చట్టాన్నీ అడ్డమైన పనులన్నిటికీ ఉపయోగించు కుంటాం...” “కాస్త అర్థమయ్యేట్టు చెప్పండి...”

“ఏ చట్టాన్నైనా, సమాజం హృదయ పూర్వకంగా ఆమోదించినప్పుడే ఆ చట్టానికి విలువ వుంటుంది, అమలు పరచబడ్తుంది. ప్రభుత్వం చేసే చట్టాల కన్నా తరతరాలుగా సమాజం పాటిస్తున్న రాయబడని చట్టాలు ఎన్నో రెట్లు శక్తివంతమైనవి... సామాజిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నియమ నిబంధనలు కూడా చట్టాల్లాంటివే... వాటిని అతిక్రమించడానికి ఆ సమాజంలో భాగస్తులైన వాళ్ళెవరూ సాహసించరు. ఎందుకంటే అలాంటి వాళ్ళు సామాజిక వెలికి గురవుతారు. సామాజిక వెలి, దీన్నే ఇంగ్లీషులో ‘సోషల్ బాయ్‌కాట్’ అంటారు. ఇది చాలా పెద్ద శిక్ష. అదే ప్రభుత్వ చట్టాన్ని అతిక్రమిస్తే శిక్షపడటం చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఉదాహరణకు వరకట్నాన్నే తీసుకుందాం. వరకట్నం తీసుకోవడం, వరకట్నం కోసం వధువును వేధించడం చట్టరీత్యా నేరమే. కానీ వరకట్నాన్ని అడగటం, తీసుకోవడం చాలా యధేచ్ఛగా, బహిరంగంగా జరుగుతూనే ఉంది. ఇలా చేస్తే చట్టం మనల్ని శిక్షిస్తుందన్న భయం ఎవరికీ లేదు. ఎందుకంటే వరకట్నం తీసుకోవడం నేరమని సమాజం భావించడం లేదు. వరకట్నానికి సామాజిక ఆమోదం ఉంది. “ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం... తండ్రి ఆస్తిలో కొంతభాగం కూతురుకు ఎందుకు చెందకూడదు అన్న ఉద్దేశంతోటే మన పూర్వులు వరకట్నం అనేదాన్ని ఒక సామాజిక వ్యవస్థగా రూపొందించారు” అంటారు వరకట్నాన్ని సమర్థించే వాళ్ళు... తండ్రి ఆస్తిలో కూతుళ్ళకూ సమాన భాగం ఉండాలన్న చట్టం కూడా వచ్చింది. వరకట్నం అనే దురాచారాన్ని అరికట్టడం కోసమే ఈ చట్టాన్ని తెచ్చామన్నారు. కానీ ఈచట్టం కూడా కాగితాలమీదనే ఉండిపోతున్నది తప్ప అమలు జరగడం లేదు. అలాగే లంచం ఇవ్వడాన్ని గానీ, తీసుకోవడాన్ని గానీ పెద్ద నేరంగా మన సమాజం భావించడం లేదు. ఎదుటివాడు మనకేదన్నా పని చేసి పెట్టినప్పుడు వాడికి తృణమో ఫణమో ఇస్తే తప్పేమిటి... అని మన సమాజం భావిస్తుంది. నేను ఫలానా ఉద్యోగం చేస్తున్నానని చెప్పగానే సమాజం అడిగే మొదటి ప్రశ్న నీకు జీతమేనా? పైన ఏమన్నా దొరుకుతుందా? అనేది అంటే నీకు లంచాలు దొరుకుతాయా? అని... లంచాలు బాగా దొరికే ఉద్యోగం చేసే వాడిని మన సమాజం గౌరవిస్తుంది. నువ్వెన్ని దుర్మార్గాలకన్నా పాల్పడు. ఎన్ని అవినీతి పనులన్నా చెయ్యి.. నీ దగ్గర బాగా డబ్బుందంటే చాలు... సమాజం నిన్ను గౌరవిస్తుంది... అందుకే మన సమాజం లంచాన్ని పెద్దనేరంగా పరిగణించదు. లంచం తీసుకోవడం చట్టరీత్యా నేరమే అయినా లంచాలు తీసుకున్న వాడికి కఠిన శిక్ష పడిన దాఖలాలు మనకు కనిపించవు. మనం దేవుడికి లంచాలిస్తాం. ఫలానా పని చేసి పెడితే నీకు నిలువుదోపిడి ఇస్తామని తిరుపతి వెంకటేశ్వరస్వామికి మొక్కుకుంటాం. ఆ పని జరిగిందే అనుకోండి... మనమూ దేవుడికి నిలువు దోపిడి ఇచ్చేస్తాం. దేవుడికే లంచమిచ్చినప్పుడు, మనుష్యులకివ్వడానికి మనమెందుకు వెనకాడతాం? లంచాలకు తీసుకునేవాడే కాదు... ఇచ్చేవాడు కూడా బాధ్యుడే. ఇచ్చేవాళ్ళుండటం వల్లే తీసుకునే వాళ్ళున్నారు..”

“దీనికి పరిష్కారం ఏమిటంటారు?”

“సమాజం మారటమే దీనికి పరిష్కారం - లంచాలు ఇవ్వడం, తీసుకోవడం - రెండూ నేరమేనని సమాజం హృదయ పూర్వకంగా అంగీకరించాలి. ప్రభుత్వం వారు తాము చేసిన చట్టాల్ని అమలు పరచే సత్తా మాకుందని రుజువు చెయ్యాలి. చట్టాన్ని ధిక్కరించినా శిక్షపడదు అన్న ధీమా ప్రజల్లో ఉన్నంతకాలం ప్రజలు చట్టాల్ని అతిక్రమిస్తూనే ఉంటారు. మరొక విషయమేమిటంటే చట్టాలను అమలుపరచే అధికారులు డబ్బున్న వాడిపట్ల ఒకరకంగా, డబ్బులేనివాడిపట్ల మరొకరకంగా ప్రవర్తిస్తుంటారు. డబ్బున్న వాడు నేరం చేస్తే వాడిని సులభంగా వదిలేస్తారు. అదే పేదవాడు నేరం చేస్తే వాడిపట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తారు. “చట్టం దృష్టిలో అందరూ సమానులే” అనేది కూడా బూటకమే... ఇలాంటి ద్వంద్వ వైఖరి పట్ల సామాజిక దృక్పథం సమూలంగా మారినప్పుడే చట్టాలంటే ప్రజల్లో గౌరవం పెరుగుతుంది. అలాంటి మార్పుకోసమే ప్రభుత్వంతో పాటు సమాజంలోని అన్ని వ్యవస్థలూ కృషి చెయ్యాలి.” ◆

పి.ఎం.సుందరరావు



కార్యదర్శి ఎంపిక

రత్నగిరి జమీందారు భూపతి రాయుడు. ఆయన దగ్గర కార్యదర్శిగా పని చేసే శంకరశర్మకు ఆరోగ్యం బాగోలేక విశ్రాంతి తీసుకుంటున్నారు. జమీందారుగారి ఆదాయ వ్యయాలు, ఇతర ఆస్తి వ్యవహారాలు చూడటానికి ఒక మనిషి కావాల్సి వచ్చింది. సమర్థుడైన వ్యక్తి కోసం భూపతిరాయుడు చూస్తున్నాడు.

అన్ని గ్రామాల్లో కార్యదర్శి కోసం ప్రకటన చేయించాడు. అది విన్న వారంతా 'జమీందారు దగ్గర కొలువంటే మాటలు కాదు. ఎక్కువ జీతభత్యాలు వుంటాయి. కొలువు వచ్చిన వారు అదృష్టవంతులు' అని అనుకోసాగారు. ప్రకటించిన గడువుకి కొంతమంది అభ్యర్థులు వచ్చారు. భూపతిరాయుడు స్వయంగా వారందర్నీ పరిశీలించాడు. ఆయన పెట్టిన పరీక్షల్లో అనంతుడు, సుధాముడు, కుముదుడు సమ ఉజ్జీలుగా నిలిచారు.

కానీ కార్యదర్శి కొలువుకి కావాల్సింది ఒక్కరే. కాబట్టి ఈ ముగ్గురిలో సరైన వ్యక్తిని ఎన్నుకోవాలి. అందుకోసం జమీందారు ఒక ఉపాయం ఆలోచించాడు.

వెంటనే ముగ్గురినీ ఒక గదిలోకి తీసుకెళ్లాడు. "ఈ ఊరికి తూర్పు దిక్కున మాకు పెద్ద పండ్ల తోట వుంది. అందులో అనేక పండ్ల చెట్లున్నాయి. వాటిలో మామిడి చెట్లు ఎన్ని వున్నాయో కచ్చితంగా లెక్క పెట్టుకుని రండి. సాయంత్రం ముగ్గురూ నా వద్దకు వచ్చి లెక్క చెప్పండి" అని పంపించాడు.

ఆ ముగ్గురూ విడి విడిగా తోటలోకి వెళ్లారు. మామిడి మొక్కలు ఎన్నో లెక్కపెట్టారు. సాయంత్రం జమీందారు వద్దకు తిరిగి వచ్చారు. "మామిడి చెట్లు ఎన్ని వున్నాయో చెప్పండి?" అని అడిగాడాయన. ముందుగా ఆనందుడు, "నాలుగు వందల మామిడి చెట్లున్నాయి" అని చెప్పాడు.

"మరి నువ్వు లెక్క పెట్టిన చెట్లెన్ని సుధామా?" అని అడిగాడు భూపతి రాయుడు.

"నాలుగు వందల మామిడి చెట్లే వున్నాయి ప్రభూ!" చెప్పాడు సుధాముడు.

చివరగా కుముదుడి వంతు వచ్చింది. అతను లేచి నిలబడి వినయంగా, "రాయుడుగారూ! వీరిద్దరు చెప్పింది నిజమే. మీ తోటలో మామిడి చెట్లు నాలుగు వందలే వున్నాయి. వాటితోపాటు ఇంకా ఆ తోటలో రెండు వందల జామ చెట్లు, నూట అరవై బత్తాయి చెట్లు, మూడు వందల సపోటా చెట్లు కూడా వున్నాయి" అని వివరంగా చెప్పాడు.

కుముదుడు చెప్పింది విని భూపతిరాయుడు ఎంతో సంతోషించాడు. "మిమ్మల్ని మామిడి చెట్లనే లెక్క పెట్టుకు రమ్మన్నాను. కానీ కుముదుడు వాటినే కాకుండా అదనపు వివరాలను కూడా తెలుసుకుని వచ్చాడు. అందుకు అతని తెలివిని, పరిశీలనా శక్తిని అభినందిస్తున్నాను. నాకు అలాంటి కార్యదర్శే కావాలి" అని అన్నాడు జమీందారు. అతడినే కార్యదర్శిగా నియమించాడు. కుముదుడు సక్రమంగా బాధ్యతలు నిర్వహించి.... కొద్దిరోజుల్లోనే భూపతిరాయుడితోపాటు బంధుమిత్రుల దగ్గర కూడా మంచి సమర్థుడుగా పేరు సంపాదించుకున్నాడు.



చిన్నారి చిత్రకారులు

జెకె. నిహారిక,
1వ తరగతి,
సెయింట్ అగస్టిన్
హైస్కూల్,
తిలక్‌నగర్,
హైదరాబాద్.



డి.అనూష,
1వ తరగతి,
సెయింట్ ఆండ్రూస్
హైస్కూల్,
సికింద్రాబాద్.



ఎన్.మేఘన,
3వ తరగతి,
సెయింట్
ఆంథొనీ
స్కూల్,
సికింద్రాబాద్.



హర్ష
4వ తరగతి,
ఆక్స్‌ఫర్డ్
స్కూల్,
హైదరాబాద్.

జై
జ
వా
న్!

చిన్నారులూ! ఇవాళ్టి బొమ్మ చూడండి. అందులో మీకు ఎ
కనిపిస్తున్నారు? య్యస్! కరెక్టుగా చెప్పేశారు. ఓ సైనికుడు మన జా
జండాకు వందనం చేస్తున్నాడు. కానీ ఇంకా ఇందులో మరో రె
ఆకారాలు వున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం. మీరు ఆ బొ
ఎటైనా తిప్పొచ్చు. ఎలాగైనా చూడొచ్చు. కానీ అవేంటో చెప్పాలి?

ఏంటి తెలిసిందా! చెప్పండి చెప్పండి. పావురం కనిపిస్తో
ఓకే. సైనికుడి మొహానికి చేతికి మధ్యలో పావురం వుంది. మరి మీరు కనిపెట్టలేని మరో బొమ్మ ఏంటో చెప్పండి చూద్దాం. చెప్పలేరా! పోనీ మమ్మల్నే చెప్పమంటారా? పేజీని అటు తిప్పి చూడండి. మీరు ఇందాక పావురం అని చెప్పిన ఆకారమే ఒంటెలాగా కనిపిస్తుంది. అవునా!

మ్యాజిక్
మ్యాజిక్



రం
గు
లు
అ
ద్ద
దా
మా

ముందు ఏం వెలిగిస్తాడు?!

సరిగ్గా రాత్రి ఏడు గంటలకు రామం వాళ్ల ఇంట్లో కరెంటు పోయింది. ఇంకా అతను చెయ్యవలసిన హోంవర్క్ చాలా వుంది. దాంతో గబగబా అగ్గిపెట్టె వెతికాడు. అందులో ఒక్కటంటే ఒక్కటే అగ్గిపుల్ల వుంది. గదిలోకి వెళ్లాడు. అక్కడ కట్టెలపొయ్యి, కిరోసిన్ లాంతరు, క్యాండిల్ వున్నాయి. మరి రామం ముందుగా వాటిలో దేన్ని వెలిగిస్తాడు?

చిక్కుప్రశ్న

బాగా ఆలోచించుకుని జవాబు చెప్పాలి. తెలీకపోతే వారం వరకు వేచి వుండాల్సిన పనిలేదు. జవాబులు కిందే వున్నాయి. పేజీ తిరగేసి చూడండి.

ఎలా మార్చాలి!

హేయ్ నేస్తాలూ! గతవారం ఇంగ్లీషుకు సంబంధించి ప్రశ్న అడిగాం కదా. ఈ వారం లెక్కల్లో మీ తెలివి తేటలను పరిశీలిద్దామనుకుంటున్నాం. మీకు ఏమాత్రం పరిశీలనాశక్తి వున్నా వెంటనే జవాబు చెప్పగలుగుతారు. సిద్ధమేనా!

తమాషా లెక్క

76 = 24. ఈ సమీకరణం రైటా? తప్పా? తప్పే. మరి 76 ఇరవై నాలుగు సమానం కాదు కదా. కానీ చిన్న చిన్న మార్పులు చేస్తే సమీకరణం సత్యమవుతుంది. అంకెలను మాత్రం మార్చకూడదు.అదే విధంగా మరే గణితపు గుర్తులను వాడకూడదు. అవే అంకెలను ఎటైనా, ఎలాగైనా మార్చవచ్చు. మరి కుస్తీ పడతారా! ఎంతకీ తెలీకపోతే మాత్రం పేజీ తిప్పి చూడండి.

బయటది తిని... లోపలది పడేసేది ఏంటంటే....

మొక్కజొన్న కండె. దానిమీద వుండే తొక్కు తీసేస్తాం. లోపలదాన్ని ఉడకబెడతాం. మళ్లీ పైన వుండే గింజల్ని తింటాం. మళ్లీ లోపల వుండే బెండుని పడేస్తాం. ఓకేనా!

ఆ ఆంగ్ల పదం ఏంటంటే...

startling . ఇప్పుడు ఇందులోంచి ఒక్కో అక్షరం తగ్గించి చూడండి. starting, staring, string, sting, sing, sin, in, I.

చిక్కుప్రశ్న, తమాషా లెక్క జవాబులు

రామం ముందుగా అగ్గిపుల్ల వెలిగిస్తాడు. మరి అది వెలిగిస్తేనే కదా. క్యాండిల్ అయినా, పొయ్యి అయినా, కిరోసిన్ బుడ్డి అయినా వెలిగేది. ఈ విషయం మీకూ తెలుసు. కానీ అనాలోచితంగా తప్పు చెప్పేస్తారు.

....

$7^2 = 49$. మీకూ ఇదే జవాబు వస్తే మీరు తెలివైన పిల్లలన్నమాట. ఏంటి అలా చూస్తున్నారు? లేని తొమ్మిది వచ్చిందనా! కానీ అది పైన ఇచ్చిన సమీకరణంలో వున్నదే. 6ని తిరగేశాం. అంతే. ఇప్పుడు ఓకే కదా.

మిత్రభేదం ముగింపు

'ఇంద్రపాలితుడు-ధనగుప్తుడు' కథ చెప్పి కరటకుడు, "ఇప్పుడు నేను ఏం చెప్పి ఏం లాభం? నీ స్వలాభం కోసం సంజీవక, పింగళకుల మధ్య చిచ్చుపెట్టావు. కొద్దిసేపటిలో ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు చనిపోవటం ఖాయం!" అన్నాడు.

దమనకుడు నోరెత్తలేదు. స్పృహ వచ్చిన సంజీవకుడు ఇంకా నేల మీద కదలకుండా పడి వున్న పింగళకుడి వైపు విచారంగా చూశాడు. కాసేపటికి పింగళకుడు తేరుకుని లేచాడు. లేచీ లేవడంతోనే భీకర గర్జన చేస్తూ సంజీవకుని మీద దాడి చేశాడు. పింగళకుని పంజా దెబ్బకు తట్టుకోలేక సంజీవకుడు ప్రాణం విడిచాడు. అప్పుడు కరటక దమనకులు పింగళకుని సమీపించారు.

పంచతంత్ర కథలు

ఇప్పుడు పింగళకునిలో ఆవేశం, కోపం లేవు. ఉద్రేకంలో మిత్రుని బలి తీసుకున్నందువల్ల కలిగిన విచారంలో వున్నాడు. చచ్చి పడి వున్న సంజీవకుని వైపు విచారంగా చూశాడు పింగళకుడు.

"కరటక దమనకులారా! ముందు వెనుకలు ఆలోచించకుండా సంజీవకుని చంపాను. రాజనేవాడు పోషణకర్త. అతను చేయువలసింది సంరక్షణ తప్ప సంహారం కాదు. కర్తవ్యం విస్మరించిన నాలాటివాడికి రాజనే పేరెందుకు, తగలెయ్యడానికా? తాను పెంచిన విష వృక్షాన్ని అయినా తాను నరికివేయుటం మంచిది కాదు. బుద్ధిమంతుడైన సేవకుడిని చంపిన రాజుకు భయపడి మిగిలినవారు దూరంగా వుంటారు. అయ్యో! ఈ సంజీవకుని చంపి ఎంత అపకీర్తి తెచ్చుకున్నాను" అంటూ విలపించసాగాడు.

"ప్రభూ! శత్రువును చంపి చింతించే వారెక్కడైనా వుంటారా? ఓర్పు తాపసులకు తప్ప రాజులకు తగదు. రాజద్రోహానికి పాల్పడిన వారు ఎవరైనా సరే శిక్షార్హులేనని పెద్దలు చెప్పారు. మిమ్మల్ని ధిక్కరించి మీతో పోరాడేందుకు వచ్చిన సంజీవకుని కోసం చింతించకండి!" అంటూ కరటక, దమనకులు పింగళకుని ఓదార్చారు.

"రాజకుమారులారా! ఇంతటితో పంచతంత్రంలోని మిత్రభేదం పూర్తయ్యింది. ఈ భేదాన్ని మీరు మీ శత్రువుల మీద ప్రయోగించి విజయం సాధించండి!" అన్నాడు విష్ణుశర్మ.

దొడ్డి కొమరయ్య బలిదానం

కె.కృష్ణమూర్తి

భూమి కోసం భుక్తి కోసం బానిసత్వ విముక్తి కోసం సాగిన వీరోచిత పోరాటంలో వీరమరణం పొందిన తొలి తెలుగువీరుడు దొడ్డి కొమరయ్య. జులై 4వ తేదీన జరిగిన ఈ సంఘటన మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలుస్తుంది. మధ్య యుగాల నాటి ఫ్యూడల్ నిజాం నిరంకుశ రాజ్యంలో ప్రజలు నరకయాతన అనుభవించారు. సంస్థానమంతా నవాబుదైతే గ్రామాలు, పల్లెలు దేశ్‌ముఖ్‌లవి, జాగీర్దార్లవి. గ్రామంలో నివాసముండాలన్నా, ఏ వృత్తి చేసుకు బతకాలన్నా, సమస్త వృత్తుల వారికీ, రైతులకూ వారి వారి పద్ధతుల్లో వెట్టి చేయక తప్పదు. మొక్కబోతే మసీదు మీద కూలిన చందంగా ప్రజల దుస్థితి వుండేది. వెట్టికి వ్యతిరేకంగా అక్కడక్కడ వచ్చిన ప్రతిఘటనను పసిగట్టిన నిజాం ప్రభువు నక్కజిత్తులతో తన పాలనలో ప్రతిఘటం లేకుండా ఎవరూ వెట్టిచాకిరీ చేయరాదని, మామూళ్లు ఇవ్వరాదని తన పాలన రజతోత్సవంలో ఫర్మానా జారీ చేశాడు. కానీ అతి స్వల్ప జీతాలతో ఉద్యోగాలు చేసే ఉద్యోగ వర్గం వెట్టిచాకిరీ, మామూళ్ళ పేరుతో ప్రజల్ని కొల్లగొట్టకుండా వుండేవారు కాదు.

ఆంధ్ర మహాసభ ఆ నిజాం ఫర్మానానే ముందుపెట్టి ప్రభువే రద్దుచేసిన వెట్టి చాకిరీని ప్రతిఘటించండి. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, మత్తేదారులు, పటేల్, పట్వారీలు అధికారులు ఏ పేరుతో వున్నా, ఏ హోదాలో వున్నా వెట్టిని ఎదిరించండి అని పిలుపు ఇచ్చింది. ఈ పిలుపుకు సమస్త ప్రజలు స్పందించి ఉవ్వెత్తున ఊరూరా కదిలారు. సంకన సంచేస్కుని ఒక చేతిలో కర్ర, మరో చేతిలో బుర్ర పట్టుకుని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు గ్రామ గ్రామానికి తిరిగి సంఘాలు పెట్టేవారం. సంఘంలో చేరడానికి కుప్పతెప్పలుగా పరుగెత్తుకొచ్చేవారు. ఆరు పైసలిచ్చి సంఘంలో పెద్దయెత్తున చేరేవారు.

ఆనాడు జనగామ తాలూకాలోకెల్లా విశ్వ రాక్షసుడని పేరుగాంచిన విసునూరు దేశ్‌ముఖ్ 60 గ్రామాలను వెట్టి చాకిరీ పేరుతో జనాన్ని పీడించుకు తినేవాడు. వాడికింద 40 మంది సాయుధ గూండాలుండేవారు. ఒక రోజు బందిగీ అనే ముస్లిం రైతును విసునూరు దేశ్‌ముఖ్ పట్టపగలు హత్యచేయించాడు. ఆ బందిగీ సమాధి దేవరొప్పుల దగ్గర రోడ్డు పక్కనే ఇప్పటికీ వుంది. విసునూరు దేశ్‌ముఖ్ ఇలాకాలోని గ్రామాల్లో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సంఘ నాయకులు ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కట్కూరు రామచంద్రారెడ్డి, సి యాదగిరి రావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, పినిశెట్టి వెంకటేశ్వరరావులతో కూడిన బృందం గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్యవంతులను చేస్తుండగా దేశ్‌ముఖ్ ఆజ్ఞ ప్రకారం విసునూరు పోలీసులు వారిని నిర్బంధించి పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టారు. కళ్ళల్లో కారాలు గొట్టారు. నోళ్ళల్లో మూత్రాలు పోసి చిత్రవధ చేశారు. ఈ హింసలు పడ్డ నాయకులెవరూ గ్రామాల్లోకెళ్లలేరని, నాయకులపైనే ఈ దుర్మార్గం జరిగితే మన గతేంటని ప్రజలు భయపడి బండకింద కప్పల్లా పడి వుంటారని దేశ్‌ముఖ్ తలపోశాడు. కానీ వాడు ఆశించిన విధంగా జరగలేదు. నాయకుల్లో ఇనుమడించిన దీక్ష, ప్రజల్లో కట్టలు తెంచుకున్న ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. విసునూరు దేశ్‌ముఖ్ పీడన కింద నలుగుతున్న గ్రామాల్లో ప్రజలు రెట్టించిన పట్టుదలతో ముందుకు వచ్చి ఎక్కడికక్కడ సంఘాలు పెట్టారు. విసునూరు దేశ్‌ముఖ్ తల్లి జానకమ్మ తన జాగీరుగా ధారాదత్తం చేసిన గ్రామంలో సంఘాలు ఏర్పాటు చేశారు. జానకమ్మ ఆ గ్రామంలో సాగించిన దౌర్జన్యాలు

అన్నీ ఇన్నీకావు. అందుకే ఆమెను కడివెండి ప్రజలు 60 ఏళ్ల కొరివి దెయ్యం అని పిలిచేవారు. సంఘం పెట్టుకున్న మరుసటిరోజే జానకమ్మ ఇంట్లో వెట్టి చాకిరీ బంద్ అయింది. దీంతో బెంబేలెత్తిన జానకమ్మ తన కొడుకు దేశ్‌ముఖ్‌కి కబురంపుతూ నడమంత్రపు సంఘం పెట్టి ఇక్కడి జనం నాకు పనులు చేయడం మానేశారు. అందువల్ల నేను ఇంట్లో నిలవలేని స్థితి ఏర్పడిందని గగ్గోలు పెట్టింది. వెంటనే దేశ్‌ముఖ్ మొహ్మద్ మిస్కీన్ నాయకత్వాన గూండాల గుంపును కడివెండి గ్రామానికి పంపాడు. గూండాలు వచ్చీ రావడంతోనే గ్రామంలో హరిజనవాడ మొదలుకొని పనివారి వాడలన్నీ తిరిగి పనులకు వెంటనే రండి. రాకుంటే పదిమందిని చంపైనాసరే పనులు చేయిస్తామని బెదిరించారు. ప్రజలు సంఘం ఆఫీసు దగ్గర పోగై తుపాకులతో వచ్చిన గూండాలను ఎలా ఎదుర్కోవాలో ఆలోచించసాగారు. ఏ దౌర్జన్యాలకైనా మొదట ప్రతిఘటన రూపం అసమ్మతి ప్రదర్శన. ఇది సంఘ నియమం. కడివెండిలో భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తమ అసమ్మతిని తెలియచేస్తూ నిరసన ప్రదర్శన జరపాలని నిర్ణయించారు.

కడివెండి ప్రజల ప్రతిఘటన

వెట్టి చాకిరీ నశించాలె, దొరల గూండాయిజం నశించాలె, ఆంధ్ర మహాసభకి జై, కమ్యూనిస్టు పార్టీకిజై, ఎర్ర జెండాకీ జై అంటూ ఊరేగింపుగా ప్రజలు పెద్దయెత్తున కదిలారు. గూండాలు తుపాకుల్లో మందు నింపుకుని ఊరేగింపును అడ్డగించారు. మేము ఇక్కడ వుండగా మా ముందు ఊరేగింపు జరపడానికి మీకు ఎన్ని గుండెలున్నాయిరా అని గద్దించారు. ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోండి. లేకుంటే పిట్టలను కాల్చినట్లు కాల్చేస్తాం అని బెదిరించారు. అయినా జనం మేము మీ దగ్గరకు రాలేదు, మా ఊళ్ళో, మా బజార్లో ఊరేగుతున్నాము. మీరే వెళ్ళిపోండి అంటూ నినాదాలతో ముందుకుసాగారు. ఆ విధంగా ముందుకు సాగుతున్న జనంపై గూండాలు తుపాకులతో కాల్పులు జరిపారు. ఎర్రజెండాకి జై, వెట్టి చాకిరీ నశించాలంటూ నినదిస్తూ వస్తున్న దొడ్డి కొమరయ్య డొక్కల్లోకి తుపాకీ గుళ్లు దూరి నేలకొరిగాడు. రెండవ గుండు దొడ్డి మల్లయ్య కాలిలో దూరి కూలబడిపోయాడు. జనం చెక్కుచెదరలేదు. గూండాలే మందుగుండు ఖాళీ అవడంతో గడీలోకి పారిపోయారు. నేలకొరిగిన తొలి తెలుగు వీరుడు దొడ్డి కొమరయ్య భౌతిక కాయాన్ని, గాయాలతో కూలబడిన మల్లయ్యను తీసుకుని కొందరు సంఘం ఆఫీసుకెళ్లగా మిగతా వారు జై కొడుతూ గ్రామమంతా తిరిగి జరిగిన దుర్ఘటనను వెల్లడిస్తూ చుట్టు పక్కల గ్రామాలకు కబురందించారు. కొమరయ్య వీర మరణం అన్ని గ్రామాలకు దావానలంలా వ్యాపించింది.

చుట్టూ గ్రామాల నుండి జనమంతా కుప్పతెప్పలుగా కడివెండికి కదిలారు. ఆ సమయంలో కడివెండికి సమీపంలోని మరిపడగ గ్రామంలో నేను వున్నాను. కొమరయ్యను భూస్వామ్య గూండాలు హత్య చేశారన్న వార్త వినగానే కాసేపు దిగ్భ్రాంతికి గురయ్యాను. వెంటనే ఆ సమాచారాన్ని చుట్టు గ్రామాలకు చేరవేసి ప్రజలను పెద్దయెత్తున సమీకరించాను. కర్రలు, ఒడిశెలలతో బయల్దేరిన జనం మహోద్రేకంతో ప్రభంజనంలా కదిలారు. కడివెండి సమీపించేసరికి మా జనం ఎదురుగా వచ్చి మీరు ఆ వైపు వెళ్లకండని, దేశ్‌ముఖ్ గూండాలు గడి కిటికీల నుంచి తుపాకులెక్కిపెట్టి వుంచారని వారించారు. అయినా మేము అటువైపే వెళ్లాలని నిశ్చయించుకుని వెళ్లాము. తీరా వెళ్ళే సరికల్లా జనం నినాదాల హోరుతో గూండాలు కిటికీలు మూసేసుకున్నారు. నేను ఆ కిటికీల దగ్గర అరుగుల పైకెక్కి గూండాలకు వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు ఇవ్వడంతో జనమంతా ఉత్తేజితులై గడీలో వున్న గూండాలను కంప పెట్టి తగులబెడదామన్నారు. వారిని వారించడం చాలా కష్టమైంది. చివరికి కొమరయ్య భౌతిక కాయాన్ని సందర్శించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించాము. తరువాత గ్రామం మధ్యలో వచ్చిన జనంతో సభ జరుపుతున్న సమయంలో విసునూరు ఎస్ఐ, కొందరు కానిస్టేబుళ్లతో కడివెండిలోకి వచ్చాడు. వాడిని చూడగానే కోపోద్రిక్తులైన ప్రజలు ఒక్కసారిగా చుట్టుముట్టి చితకబాదారు. తరువాత వారిని ఒక చోట కూర్చోండబెట్టడం జరిగింది. ఇంతలో చుట్టు పక్కల ప్రాంతాల జమీందార్లు, వారి గూండాలు తుపాకులు

ధరించి నలబై బళ్లలో వచ్చి గ్రామానికి దూరంగా కాచుకుని వున్నారని సమాచారం అందింది. వెంటనే పోగై వున్న జనమంతా కర్రలు, ఒడిశెలలతో సిద్ధమయ్యారు. వారినందరినీ అడ్డంగా రక్షణ కుడ్యంగా నిలబెట్టి నేను, కడివెండి మోహన్‌రెడ్డి, మర్రి రామ్‌రెడ్డి మొదలగు కార్యకర్తలతో గూండాలపైకి జనాన్ని నడిపాము. గూండాలు ఈ జన ప్రవాహాన్ని చూసి బళ్లను వెనక్కు తిప్పి పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంటాడి జనం చితక దన్ని తీర్థంలో కుక్కలను కొట్టినట్లు కొడుతూ వారిని విసునూరు దాకా తరిమి కొట్టారు. తిరిగి మేమంతా కడివెండి చేరేసరికి గడీలో దాక్కున్న జానకమ్మ, గూండాలంతా పారిపోయారు.

తొలి తెలుగు వీరుడు దొడ్డి కొమరయ్య వీరమరణం అఖిలాంధ్రదేశాన్ని కుదిపివేసింది. తద్వారా యావదాంధ్రానికే మార్గదర్శకమైంది. మధ్యయుగాలనాటి భూస్వామ్య వ్యవస్థను, రాచరిక రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించివేసిన చారిత్రాత్మక వీర తెలంగాణా విప్లవ పోరాటానికి నాంది పలికిన మహత్తర సంఘటన అది. నిజాం ముష్కరుని బలగాలను నుగ్గడించి, స్వతంత్ర హైదరాబాద్‌ను రద్దు చేసి భారత్‌లో అంతర్భాగం గావించిన మహత్తర పోరాటమిది. 50 వేల సైన్యాలను మూడు సంవత్సరాలు ఢీకొని నిలబడి జాగీర్దారీ వ్యవస్థను, రాచరిక వ్యవస్థను తుదముట్టించిన మహత్తర ఘట్టమిది. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచింది. 4 వేల మంది అమరవీరులు రక్త బలిదానం గావించి మూడు ముక్కలైన తెలుగుజాతిని ఒక్కటి చేయడంతో పాటు తెలుగునేల ఒక్కటి కాక ముందే మూడు ప్రాంతాల కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఈ చారిత్రాత్మక పోరాటంలో సమైక్యంగా రక్తతర్పణ చేసిన మహోద్యమమిది.

మంచి ముత్యాల దండ

(9వ పేజీ తరువాయి)

కూరగాయలు తెస్తారా?" రేవతి ప్రశ్నించింది.

రామలక్ష్మి తెరలు తెరలుగా నవ్వుతూ – 'కూర్చుంటే కాలు కదపరు... మీకు బి.పి. ఉంది, మంచిది రోజూ నడవండి అంటే చలి అని ఒకసారి... కాలునొప్పి అని మరోరోజూ, కుక్కలు వెంటపడుతున్నాయని ఇంకోసారి సాకులు చెబుతుంటారు... ఈయన చేస్తున్న పని పొదులు పెట్టడం... పెరటి తోటలో కూరగాయలు పెంచడం... అంతే!' అంది.

"ఏమూ నన్నే అంటుంది. ఏనాడైనా నా మాట వింటుందా? డాక్టర్లు వద్దంటున్నా రోజూ చీకటితోనే తలంటు స్నానాలు మానదు.." రేవతికి వారి దాంపత్యం ముచ్చట వేసింది.

తన పరిస్థితి గుర్తుకు వచ్చి మనసు ఏదోలా అయిపోయింది. హేండ్‌బేగ్‌లో ముత్యాల పొట్లం జ్ఞాపకం వచ్చి బైటికి తీసింది. మళ్లీ లోపల పెట్టేసింది.

"హైదరాబాద్ నుంచి ప్రయాణం... రైల్లో నిద్రపట్టిందో లేదో తెలీదు. ఈ ఇల్లు నీదే అనుకో... ఏ మొగమాటం వద్దు. పక్కగది నీకే కేటాయించాం.... హాయిగా స్నానం చేసి పడుకో... వంట చేసి లేపుతాను.." ఆమె నెమ్మదిగా చెప్పింది. "మీరు ఒక్కరే ఎందుకు... నేనూ సాయం చేస్తాను!" "నీచేత ఏ పనులూ చేయించవద్దని మా సరస్వతి చెప్పింది... నువ్వు మా అతిథివి..."

తను ఎవరో ఎందుకు వచ్చిందో తెలియకపోయినా స్వంతమనిషిగా వారి ఆదరణ విస్మయాన్ని కలిగిస్తోంది. స్నానం ఎప్పుడు ముగించిందో మంచం మీదకు ఎప్పుడు చేరిందో తెలియలేదు. అలసటతో రేవతి నిద్రలోకి జారిపోయింది.

* * *

నెల రోజుల క్రితం – "మనం భార్యభర్తలమే! కాదనను... అన్ని విషయాలూ నీకు చెప్పాలా? ప్రతిదానికీ నా మీద కమాండ్ చేస్తున్నావు ఇది నాకు నచ్చడం లేదు!" భర్త చక్రధర్ మాటలు రేవతికి విసుగు కలిగించాయి.

"అవును. నాకూ మీరంటే అభిమానం ఉండటం లేదు. చూస్తుంటే ఏదోలా ఉంటుంది. పెళ్ళయి అయిదేళ్ళు కాకపోయినా యాభై ఏళ్ళు అయినట్లుంది..."

"రోజూ నిన్ను చూస్తున్నందువల్ల కాబోలు... ఒకలాంటి నిరాసక్తత వస్తోంది. నీలో ఆకర్షణ తగ్గిపోయిందని అనిపిస్తోంది" చక్రధర్. ఆ తర్వాత వరుసగా జరిగిన సంఘటనలు మానసికంగా వారిని దూరం చేశాయి. తనను ఇష్టపడని వ్యక్తిని ఎందుకు భరించాలి అనుకుంది. విసుగు, చికాకు పెరిగి పోయాయి.

బ్యాగు సర్దుతుండగా మంచి ముత్యాలదండ కనిపించింది. పెళ్ళయిన కొత్తలో చక్రధర్ ఆమెకు బహుమతిగా ఇచ్చాడు. రేవతి చేతిలోకి తీసుకుని చూస్తుండగా "ఆదండ నేను ఇచ్చిందేనా అనిపిస్తోంది!" షూ కట్టుకుంటూ చక్రధర్ యథాలాపంగా అన్నాడు. రేవతికి కోపం నసాళానికి అంటింది.

చేతిలో వున్న దండ విసిరికొట్టింది. తెగిపోయి ముత్యాలు గదంతా చెల్లాచెదురు అయిపోయాయి. చక్రధర్ ఏమీ అనలేదు. అన్నీ ఏరి కాగితంలో పొట్లం కట్టి రేవతి చేతిలో పెట్టి "ఆఫీసుకు టైమైంది!" అంటూ వెళ్ళిపోయాడు.

ఆమె మనసులో అదోలాంటి భావన ఏర్పడింది. ఆ సమయంలో భీమిలి నుంచి సరస్వతి ఫోన్ చేసింది. ఇంటిలో సంగతులన్నీ వివరంగా చెప్పిన తర్వాత రేవతికి కాస్త ఊరట కలిగింది.

తర్వాత సరస్వతి – "నువ్వు మా అత్తమామల్ని చూడాలి. మా ఇంట్లో కొద్దిరోజులు గడుపు!" ఆహ్వానించింది. వెంటనే రేవతి ఏమీ నిర్ణయించుకోలేదు.

ఆ మర్నాడు చక్రధర్‌తో చెప్పి భీమిలి బయలుదేరింది. అతను పెద్దగా అభ్యంతరం చెప్పలేదు.

రేవతిలో ఆలోచనల పరంపర.

* * *

"వంట అయిపోయింది. భోజనానికి రామ్మా!" రామలక్ష్మి లేపింది. టైము చూస్తే మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది. డైనింగ్ టేబుల్ వద్ద సోమేశ్వరరావు కూర్చున్నారు.

రేవతి వెళ్ళి కూర్చుంది. టేబుల్‌పై అన్నీ నీట్‌గా సర్ది ఉన్నాయి. అందరి కంచాల్లో అన్నం వడ్డించి, తన కంచంలో అన్నం పప్పు కలిపి పెద్ద ముద్దగా చేసి భర్తకు తినిపించింది. అంతవరకు బుద్ధిమంతుడిలా కూర్చున్న వ్యక్తి తిన్న తర్వాత తన కంచంలో అన్నం కలపడం మొదలుపెట్టాడు.

రేవతి ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూసింది.

"పెళ్ళయిన దగ్గర నుంచి మొదటి ముద్ద నేను తినిపించవలసిందే! సర్వీసులో ఉన్నప్పుడు పనుల మీద బైటికి వెళ్ళినప్పుడు తప్ప ఈ సంప్రదాయం ఎప్పుడూ తప్పలేదు!" "మొదటి అన్నం ముద్దలో అమృతం ఉంటుందంటారు!" సోమేశ్వరరావు చిన్న పిల్లవాడిలా చెప్పాడు. భోజనాల ప్రక్రియ గంటసేపు కొనసాగింది. భార్యాభర్తలిద్దరూ కబుర్లే కబుర్లు.

తర్వాత లోపలికి వెళ్ళిపాత వారపత్రికలు రేవతికి ఇచ్చింది రామలక్ష్మి. కంచాలు తీసిన తర్వాత వాలు కర్చీలో ఉన్న భర్త వద్దకు వచ్చి నేలమీద కూర్చుని భగవద్గీత పుస్తకం విప్పింది. ఆమె శ్లోకాలు, తాత్పర్యాలతో మెల్లగా చదువుతుంటే సోమేశ్వరరావు వింటుండిపోయారు.

పాత పుస్తకాల్లో బొమ్మల్ని చూస్తూ భార్యాభర్తలిద్దర్నీ గమనిస్తోంది రేవతి. ఆ రోజే కాదు. వరుస రెండు రోజులూ వారి ప్రతి చర్యనూ చూసింది. టీవీ సీరియళ్లు చూసే సమయంలో చెముడు ఎక్కువైందని ఒకరు, చత్వారం వచ్చిందని మరొకరు దెప్పి పొడుచుకోవడం, జోకులు వేసుకోవడం ఎన్నెన్నో సంఘటనలు వరుసగా జరిగిపోయాయి.

సరస్వతి ఊరి నుంచి రాలేదు. వారిద్దరి సాన్నిహిత్యం రేవతికి ఒంటరితనం అనిపించేది.

"పెళ్ళయి నలభై ఏళ్ళయినా మీకు ఎప్పుడూ మోనాటనీ రాలేదా?" రామలక్ష్మి ఒక్కతే ఉన్నప్పుడు రేవతి ప్రశ్నించింది. 'భార్యాభర్తల మధ్య ఆకర్షణ తగ్గకుండా చూడటం ఒక కళ. ఏళ్ళు గడుస్తుంటే పిల్లలు... సంసారం... బాధ్యతలు... అనారోగ్యం ఉంటాయి. నా చుట్టూ ఎంతమంది ఉన్నా ఆయన ఎప్పుడో నాకు మాత్రమే అర్థమయ్యే చూపు విసురుతారు. చెవిలోమాట వదులుతారు!" ముసిముసిగా నవ్వుతూ అంది.

"మాలో ప్రతి ఊహ రెండవ వారికి తెలుసు. అయినా ఎప్పుడూ ఏకాంతంలో కూర్చుని మాట్లాడుకున్న మధుర క్షణాలు మా ప్రేమ బంధం మాసిపోకుండా వెలిసిపోకుండా చూస్తూనే ఉంటాయి. కొద్దిరోజుల ఎడబాటు తర్వాత కలుసుకున్న ప్రతిసారి అప్పుడే మొదటి కలయిక అనుభూతి కలుగుతుంది.–" రామలక్ష్మి చెబుతున్నప్పుడు కళ్ళల్లో అదోలాంటి వెలుగు రేవతికి కనిపించింది.

ఆ సాయంత్రం ముగ్గురూ కలిసి సినిమాకు బయలుదేరారు. సముద్రం వెంబడి నడుస్తూ పురాతన కట్టడాలను, డచ్చివారి సమాధులను చూస్తూ ఊరవతల నున్న హాల్లో మల్లీశ్వరి పాత సినిమా.... బాగా ఎంజాయ్ చేశారు.

ఇంటికి వచ్చిన తర్వాత భార్యాభర్తలిద్దరూ టాటా చెప్పి గదిలోకి వెళ్ళిపోయారు. రేవతి ఒంటరిగా మిగిలిపోయింది.

చీకట్లో మట్టిరోడ్డు పాములా కన్పిస్తోంది. తోటలోంచి పూల పరిమళం గాలిలో తేలుతూ ఆ ప్రాంతమంతా వ్యాపించింది. దూరంగా సముద్రహోరు మంద్రంగా వినిపిస్తోంది. రేవతి బ్యాగులోంచి ముత్యాల పొట్లం తీసి టేబుల్ మీద పెట్టింది. లైటు ఆర్పి మంచం మీద వాలిపోయింది.

"సరస్వతి రెండ్రోజుల్లో వచ్చేస్తానని నిన్ను ఉండమంది. మనం రాత్రి సినిమాకు వెళ్ళినప్పుడు ఫోన్ చేసిందట. రామగోపాలం ఇప్పుడే చెప్పారు!" ఉదయం టిఫిన్ చేస్తుండగా సోమేశ్వరరావు చెప్పారు.

"లేదు బాబాయిగారూ! నేను ఈ రోజే వెళ్ళిపోతున్నాను. రిజర్వేషన్ దొరక్కపోతే బస్సు మీద అయినా వెళతాను!" అంది రేవతి. తర్వాత బట్టలు సర్దుకుంది. రామలక్ష్మి గదిలోంచి వస్తూ – "నీ ముత్యాలను దండగా గుచ్చాను. ఇవి మంచి ముత్యాలు... పొట్లంగా వదిలేశావు.." అంటూ ముత్యాలు గుచ్చిన దండ అందించింది. రేవతి అప్రయత్నంగా అందుకుంది.

"నా ఫ్రెండు సరస్వతిని కలుసుకోలేక పోయాను. కానీ ఈ ఇంట్లో గొప్ప స్నేహితుల్ని చూశాను. మంచి ప్రేమికులతో కలిసి వున్నానన్న సంతృప్తి మిగిలింది.." రేవతి కళ్ళల్లో నీటి పొర.

గబగబా ఇంట్లోంచి బైటికి వచ్చి సామానుతో మట్టిరోడ్డు ఎక్కింది. చివరకు వెళ్ళిన తర్వాత రోడ్డు మలుపు నుంచి వెనక్కి చూసింది. సన్నని కాలిబాట... అది అంతమయ్యే చోట పెంకుటిల్లు... వరండాలో చేతులూపుతూ భార్యాభర్తలు టాటా చెబుతున్నారు. ◆

ఇది విన్నారా?

లక్ష్మి

నాకు తెలిసిన రహస్యం– మీకు చెప్పకపోవడానికి... అనేకానేక కారణాలుంటాయి!

నేను మహత్తరమైన విషయంగా భావిస్తే మీకది ఆఫ్టరాల్‌గా తోచి ఓసింతేనా అని తీసిపారేయవచ్చు!

నేను చెప్పింది విన్న తర్వాత మీరు కళ్ళెర్ర చెయ్యవచ్చు!

నేను చెప్పే రహస్యంలో మీకు బొత్తిగా ఇంటరెస్టు లేకపోవచ్చు. చెప్పినా మీకు అర్థం కాకపోవచ్చు. మీకు సంబంధం లేని విషయమని నన్ను హెచ్చరించవచ్చు. మాటలు మోసే బుద్ధి మానుకోమని నన్ను తిట్టవచ్చు!

. ఇవన్నీ విడిచిపెట్టండి!

రహస్యాన్ని రహస్యంగానే దాచుకోమని రూలు!

ప్రాణంకంటే మిన్నగా ఎంచుకోమని శాస్త్రం!

ఈ రూల్సూ శాస్త్రాల్ని చాలామంది గాలికొదిలేస్తుంటారు. ఎక్కడో విన్నదీ కన్నదీ – ఇక్కడ చెప్పేస్తుంటాం. ఈ ఏర్పాటు వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతాయో పట్టించుకోం!

ఈ విద్యలో–

ఆడవాళ్ళే ఆరితేరిన వాళ్ళని మగమారాజులు చెబుతుంటారు. ఆడవాళ్ళ నోట్లో నువ్వుగింజ నానదనే సామెత కూడా వాళ్ళే ప్రచారంలో పెట్టి వుంటారు!

అక్కడికి మగవాళ్ళు మాత్రమే రహస్యకారులైనట్టు బడాయి!

రహస్యాలు అల్లరి చెయ్యడంలో ఆడామగా తేడాలుండవు. ఈ విద్యలో అందరూ అందరే! వదిలెయ్యండి!

రహస్యం విన్న పాపానికి ఆటోమేటిగ్గా గుండె బరువు పెరుగుతుంది. ఎక్కడోచోట కక్కకపోతే ప్రాణాలు పోయేంత పనవుతుంది!

అంచేత–

రహస్యం తెలీగానే – ఆ సమాచారం పక్కింటి పిన్నిగారికీ ఎదురింటి వదినగారికీ వెంటనే చెప్పాలి. ఆలిస్యమైతే మనశ్శాంతి కరువైపోతుంది!

కుళాయి దగ్గిరో...

ఇంటి అరుగుమీదో..

మీటింగు పెట్టి ఆ రహస్యాన్ని ఉతికి ఆరబెట్టిం తర్వాతగానీ మనసుకుదుట పడదు! మీకు తెలీని విషయం నేను మీకు చెబితే నాకు అదో ఘనత! కేవలం అందుకే ఇంత తాపత్రయం!

మగవాళ్ళల్లో కూడా ఈ లక్షణం బతుకుతూనే వుంది!

కొందరు భళ్ళున కక్కేస్తారు. మరికొందరు మందుపట్టులో వాగేస్తారు. మందుమీద కూచున్నప్పుడు ఎన్నెన్నో రహస్యాలు బయటపడతాయని వాళ్ళే చెప్పుకుంటుంటారు!

నా చిన్నతనంలో –

కాశీదంపతులని మా వీధిలోనే వుండేవారు!

ఇద్దరూ ఇద్దరే పుణ్య దంపతులు!

ఆ రోజుల్లో ఆవిడకు ఆలిండియా రేడియో అని ముద్దు పేరుండేది. ఆవిడగారు ఎవరింటికైనా వెళ్ళినప్పుడు – ఆలిండియా రేడియో ఫలానా ఇంటికి వెళ్ళిందని చెప్పుకునే వారు!

ఆవిడగారు మాత్రం తనకున్న బిరుదుని పట్టించుకునేది కాదు!

కనకమ్మ గారి కోడలు నీళ్ళోసుకుందిట అని ప్రారంభించేది. చాలా కాలానికి శుభవార్త విన్నామని వార్త విన్నవాళ్ళు సంతోషిస్తుండగానే –

"దిక్కుమాలిన కడుపు. ఎందుకడుగుతార్లే? చెప్పుకుంటే సిగ్గుచేటు. ఆ కడుపు వెనకబోలెడు కథ వుందిట. నేను చెప్పినట్టు ఎవరికీ చెప్పద్దు!" అంటూ ఒక రహస్యం చెప్పేది!

ఆ దిక్కుమాలిన రహస్యంలో బోలెడు లింకులుండేవి!

రహస్యంలో తాళం తప్పినా – లింకుల్లో మాత్రం తేడాలు ఏ మాత్రం రాకుండా జాగ్రత్త పడేది. ఇంతటితో ఈనాటి ప్రసారం సమాప్తం అనే బాపతు ముగింపునిచ్చి – పక్కింటికి ప్రసార ప్రారంభానికి వెళ్ళేది!

ఆ కాశీ దంపతుల్లో –

భర్తగారి పాత్ర మరింత విడ్డూరంగా వుండేది!

ఆయన రహస్యాలు చెప్పరు. కానీ, చెప్పే ప్రతి విషయం ఎంతో రహస్యంగా చెప్పేవాడు!

వినే మనిషిని ఓ మూలకి రెక్కపట్టుకు లాక్కు వెళ్ళేవాడు. ఒకచోట అతన్ని నిలబెట్టి అటూయిటూ పరిసరాలు పరిశీలించి చూసేవాడు. తమనెవరూ గమనించడం లేదని నిర్ణయించుకున్న తర్వాత అసలు రహస్యం ఎంతో రహస్యంగా చెప్పేవాడు. ఏమని?

"ఇవాళ మార్కెట్లో బంగాళా దుంప రేటు మండిపోతోంది!"

శ్రీమతి కాశీగారు చెప్పే రహస్యం వినేందుకు భయపడకపోయినా – శ్రీయుత కాశీగారు చెప్పే రహస్యాలకు మాత్రం జనం ఆ రోజుల్లో విపరీతంగా వణికిపోయేవారు!

ఆయన చెప్పే రహస్యం వినేందుకు ఎంతో శ్రమపడాలి. మనుషులకు దూరంగా నిలబడాలి. అక్కడి వాతావరణం వగైరాలు జాగ్రత్తగా గమనించాలి. ఆపైన ఆయన చెప్పే గొప్ప రహస్యం – గోంగూర ధర విని ఆహా అట్లాగా అని ఆశ్చర్యపోవాలి!

కత్తితో పొడిచినా గుండెల్లో దాచుకున్న రహస్యాల్లో ఏ ఒక్కటి కూడా బయట పెట్టని జాతి ఒకటుంది. వీళ్ళని స్టెనోలని పిలుస్తుంటారు!

ప్రభుత్వ ప్రైవేటురంగ కార్యాలయాల్లో ఎన్నెన్నో రహస్యాలు వీళ్ళ చేతుల మీదుగానే టపటపలాడుతుంటాయి!

పీకమీద కత్తిపెట్టినా–

అక్షరం బయటపెట్టని రహస్య వీరులు వీరు!

సీక్రసీకి సింబల్స్!

స్టెనోల్లో – ప్రత్యేకించి – ఆడవాళ్ళే అధికంగా ఎందుకుంటున్నారో ఇప్పుడర్థమైంది కదా?

రహస్యాన్ని రహస్యంగా వుంచడం వాళ్ళడ్యూటీ!

ఈ సృష్టి రహస్యం గమనించనివాళ్ళు – నోటికొచ్చిన దిక్కుమాలిన సామెతలతో నోళ్ళు మూయించే స్థితికి ఎదుగుతున్నారు!

నిర్వేద నిర్వాణపర్వం

రుక్మిణి

నేను వెళ్ళేసరికి అద్వానంగారి ఇంటి బయట అంతా కోలాహలంగా వుంది. కొంతమంది ఉద్రిక్తంగా అరుచుకుంటున్నారు. మరికొంత మంది వాండ్లను సముదాయిస్తున్నారు. అయితే ప్రత్యేకంగా ఆ గుంపు మధ్యలో చాలా త్రిశూలాలు తళతళ మెరుస్తూ నిక్కి కనిపించాయి. వాటి పక్కనే కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి. నేను వాటినేమీ పట్టించుకోకుండా మేడమెట్లెక్కి అద్వానంగారి గదిలోకి వెళ్ళాను.

అక్కడ నేను నిర్ఘాంతపడాల్సిన దృశ్యం కనిపించింది. నాకు ఒక్కసారే మూర్ఛవచ్చినంత పనయ్యింది. నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. ఇది కలా? నిజమా? అద్వానంగారు కటిక నేలమీద రెండు కాళ్ళ మధ్య తలదాచుకుని నిశ్శబ్దంగా కూలబడి వున్నారు. ఎప్పుడూ ఆయనగారు ఠీవీగా ఆసీనులై శాంత గంభీర వదనంతో, అరమోడ్పు కళ్ళతో రకరకాల సూత్రాలను వల్లిస్తూ.. మధ్య మధ్య కమ్మని కవితలు వినిపించే ఆ సింహాసనం బోసిపోయి కనిపించింది. అందులోనూ వారు సమయాన్ని సందర్భాన్ని బట్టి విరుద్ధ ప్రకటనలు ఆ సింహాసనం మీది నుండే చేస్తూ ప్రశాంతంగా కాలాన్ని ఓపిగ్గా నెట్టుకొచ్చినారాయె!

"సార్ మీరట్లా చింతాక్రాంతులై వుండిపోయారు. ఏమైనా కొత్త కవితలు తయారు చేయడంలో ఇది ఒక భాగమా?" చాలా నెమ్మదిగా అడిగాను. ఆయనగారు తలపైకెత్తి చూసి మళ్ళా రెండు కాళ్ళ మధ్య తల ఇరికించుకున్నాడు.

"పోనీ మీరింతకు ముందు చేసిన ప్రకటనలకు మీరే విరుద్ధంగా చేయబోయే ప్రకటనల కోసం ఇట్లా ప్రాక్టీసుగాని చేస్తున్నారా?" అన్నాను.

"మూర్ఖుడా!" ఆయనగారు అట్లా కూర్చునే పండ్లు పటపటలాడించారు. నేను హడలిపోయాను. వారు నేలమీద ఆసీనులై వుండగా నేను స్టూలెక్కడం సబబు కాదు కాబట్టి వారి పక్కనే దొంతుకాళ్ళమీద కూలబడిపోయాను.

"సార్... మీరెందుకంత విచారంగా వున్నారు. కోప్పడకండి" చాలా మృదువుగా అడిగాను. మోకాళ్ళ మధ్య నుండి రెండు వెక్కిళ్ళు వినిపించి చలించిపోయాను. తలనెమ్మదిగా పైకెత్తి "ఈ ఘోర ఓటమిని భరించడం దుర్భరంగా వుంది. జీవితంలో ఇంతటి ఓటమిని చవి చూస్తానని కలలో కూడా ఊహించలేదు (రెండు వెక్కిళ్ళు)

"సారీ... ఈ మీ ఓటమి కోసం ప్రజలంతా ఎందుకు సంఘటిత మయ్యారో నాకర్థం కాదు. మీరు మితభాషి, మృదుస్వభావులు, మేధావులు, ప్రపంచం మొత్తం మీ నడక చూసి అబ్బురపడిపోతుంది..

ఆయన గారు మెరిసే కళ్ళతో కాసేపు విజయగర్వంగా తృప్తిగా నాకేసి చూసి దగ్గరగా రమ్మని నా చెవి దగ్గిర నోరు ఆనించాడు.

"గుజరాత్ – గోద్రా సంఘటనలు మమ్మల్ని బాగా దెబ్బతీశాయి. దేశం, ప్రపంచం మొత్తం ఆ సంఘటనల పట్ల దిగ్భ్రాంతినీ – ఆగ్రహాన్ని వెళ్ళగక్కాయి. అసహ్యించుకున్నాయి – అదే... అదే... దాని ఫలితం ఇదే... ఇదే...

"మరి అపుడు మోగిన ఆ మృత్యుఘోషలో మీ కవితాగానం ఆ రోజుల్లో వినిపించకపాయె – మీ గొంతు అపుడు మూగబోయిందా సార్..."

"దరిద్రుడా... నీకు రాజకీయం అస్సలు తెలవదు. అపుడుగానీ నేను దాన్ని ఖండించి వుంటే నా పదవి కాస్తా వూడిపోయేది. అందుకే ఈ పరాజయం తర్వాత ధైర్యంగా అక్కడి ముఖ్యమంత్రిని ఊడబీకాలని నిర్ణయించుకున్నాను. తిరుగులేదు!" ఆయనగారు హుషారుగా ఒకసారి లేచి నుంచుని తొడలు, జబ్బలు లపలప చరిచాడు – సకిలించాడు.

"మరి కింద ఆ గోలంతా ఏంటి సార్" వినయంగానే అడిగాను.

"మా మిత్రపక్షాలు... కిచిడీ... ఆ గోద్రా... మా దెబ్బకే ఆ పక్షాలన్నీ వాళ్ళ రాష్ట్రాల్లో మట్టి కరిచాయి. అందుకే తప్పంతా నాదేనన్నట్లు గుజరాత్ గోద్రా అల్లర్లకు క్షమాపణలు చెప్పి వెంటనే అక్కడి ముఖ్యమంత్రిని మార్చాలని గోల చేస్తున్నారు. నా నిర్ణయంలో మార్పులేదు. మార్చుతాను.." వారు ఈ మాటలు చెప్పేలోగానే వారి మెడలోని సెల్‌ఫోన్ మోగింది. చెవిదగ్గిర పెట్టుకుని వింటున్న వారి మొహంలో చకచక రంగులు మారసాగాయి. అంతా విని నిటారుగా బడితెలా వున్నవారు మళ్ళా నేలమీద కూలబడి కాళ్ళ మధ్య తలకాయ ఇరికించేశారు. నేను ఆశ్చర్యంతో కొయ్యబారి పోయాను.

"మళ్ళా ఏమయిందిసార్..." భయంభయం గానే అడిగాను. ఆయనగారు మొహం ఎత్తి రౌద్రంగా నాకేసి చూస్తూ" ఎన్నికల్లో ఈ పరాజయానికి కారణం ఇప్పుడు తెలిసింది. గుజరాత్ మారణహోమానికీ, ఈ అపజయానికీ ఎలాంటి సంబంధం లేదు – అసలు అక్కడి ముఖ్యమంత్రిని మార్చాల్సిన పనికూడా లేదు. అతను మిక్కిలి సమర్థుడు. రాజధర్మాన్ని పాటించిన రాజకీయవేత్త. నాబుర్రంతా గిరగిరా తిరిగి నేల మీద కూలబడిపోయాను.

"అసలు మా హిందూత్వ ఎజెండాను మతతత్వాన్ని వదిలిపెట్టినట్లు నటించడం మేం చేసిన పెద్దతప్పు. ఈ కిచిడీ పార్టీల వాళ్ళనీ... కుహనా లౌకిక వాదుల్నీ కలుపుకుని ఎన్నికల గోదాలోకి దిగడం మరో తప్పు. జైశ్రీరాం... మా పాత ఎజెండాకే కట్టుబడి వుంటాం..." ఆయనగారి ఆవేశం చల్లారినాక నేను లేచి నెమ్మదిగా అన్నాను.

"మీ అంత కపటీ... ద్వంద్వ ప్రమాణాలు, రెండు నాలుకలున్న నాయకుడు లేడు. మీ పై బాసులు ఆరెస్సెస్, విహెచ్‌పి చేతుల్లో మీరు కీలుబొమ్మలు. ప్రజల్ని తికమకపెట్టే మీ చాతుర్యం చాలా గొప్పది. కానీ జాగ్రత్త ఈసారి తిరిగీ అలాంటి వేషాలు వేస్తే ఎన్నికల్లో ఓడించినట్లు కాదు. దేశ ప్రజలు మిమ్మల్ని వెలివేస్తారు – అంతే" అని నేను వడివడిగా మెట్లుదిగి కిందికి వచ్చాను.

కింద కాషాయమూక పెడబొబ్బలు పెడుతూనే వుంది. ◆

వ్యాధి నిర్ధారణలో రోగులకు వరం



రేడియో డయాగ్నొసిస్

1885 సంవత్సరంలో జర్మనీలో విల్‌హెల్మ్ కాన్రాడ్ రాంట్‌జెన్ ఎక్స్‌రేలను కనుక్కోవడంతో రేడియోలజి ఆవిష్కృతమైంది. అది రోగ నిర్ధారణలో నూతన శకానికి నాంది పలికింది. తర్వాత నిరంతర నిర్విరామ పరిశోధనల ఫలితంగా అల్ట్రాసౌండ్, సి.టి.స్కాన్, ఎం.ఆర్.ఐ. వంటి అత్యాధునిక ఇమేజింగ్ యంత్రాలు రంగప్రవేశం చేయడంతో, రేడియోలజీలో మళ్ళీ రేడియో డయోగ్నొసిస్ అనే ఉపవిభాగం ఆవిర్భవించింది. ఫలితంగా శరీరంలోని అతి సూక్ష్మమైన అసాధారణతను సైతం అవలీలగా, రోగికి ఏ మాత్రం నొప్పిలేకుండా అద్భుతమైన సమాచారాన్ని పసిగట్టగలిగే అవకాశం ఏర్పడింది. దీనివల్ల వ్యాధి చికిత్సలో, రోగుల జీవితకాలాన్ని పొడిగించడంలో వైద్యనిపుణులు విజయం సాధిస్తున్నారు.

డా॥ ఎం.ఆదినారాయణరావు, ఎం.డి.ఆర్.డి

✤ రేడియో డయోగ్నొసిస్ అంటే ఏమిటి? దీని పుట్టు పూర్వోత్తరాలేమిటి?

ఎక్స్-రేలు, అల్ట్రాసౌండ్, కంప్యూటెడ్ టోమోగ్రఫీ స్కాన్ (సి.టి.స్కాన్), మాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్ (ఎం.ఆర్.ఐ.) లేజర్, గామా కిరణాలు; రేడియో ఐసోటోప్‌లు మొదలైన వాటిద్వారా వ్యాధి నిర్ధారణ చేయడాన్ని 'రేడియో డయాగ్నొసిస్'గా పేర్కొనవచ్చు. ఇక ఈ విభాగం పుట్టుపూర్వోత్తరాల విషయానికి వస్తే, 1980 ప్రాంతంలో రేడియోలజీ, రేడియో డయాగ్నొసిస్, రేడియో థెరపి అనే రెండు ఉపవిభాగాలుగా విడిపోవడం జరిగింది. ఒక్క రేడియో డయాగ్నొసిస్ గురించి మాట్లాడాలంటే, రాంట్‌జెన్ ఎక్స్‌రేల ఆవిష్కరణే ఈ స్పెషాలిటీకి మూలమని చెప్పాలి. 1950 ప్రాంతంలో అల్ట్రాసౌండ్ ఆవిష్కరణ స్పెషాలిటీ కొత్త పుంతలు తొక్కింది. 1970 ప్రాంతంలో గాడ్ ఫ్రె హౌన్స్‌ఫీల్డ్, యాంబ్రోజ్‌లు కంప్యూటెడ్ టోమోగ్రఫీ స్కాన్‌ను, డెమాడియన్ ఎం.ఆర్.ఐ. స్కాన్‌ను కనుగొనడంతో రేడియో డయాగ్నొసిస్ విశ్వవ్యాప్తి ఖ్యాతినార్జించింది. రోగనిర్ధారణలో వైద్యులకు అత్యంత విలువైన సమాచారాన్ని అందిస్తూ, రోగాల చికిత్సలో అత్యంత కీలక పాత్ర వహిస్తున్నది.

✤ ఎక్స్-రేలో బేసిక్ ప్రిన్సిపుల్ ఏమిటి? ఇవి ఎలాంటి రోగాల నిర్ధారణలో ఉపయోగపడుతున్నాయి?

ఎక్స్-రేలు చొచ్చుకొని వెళ్ళే పదార్థాలను రేడియో ల్యూసెంట్‌లు అంటారు. చొచ్చుకు వెళ్ళలేని పదార్థాలను లేదా శరీరావయవాలను రేడియో ఓపెక్‌లంటారు. ముఖ్యంగా మన శరీరంలోని ఎముకలు, పళ్ళు, కిడ్నీస్టోన్స్, గాల్‌స్టోన్స్, కాల్సిఫికేషన్ మొదలైన వాటి నుండి ఎక్స్‌రేలు చొచ్చుకొని వెళ్ళలేక, ఎక్స్-రే ఫిల్మ్‌మీద నీడలను ఏర్పరచడం జరుగుతుంది. ఇది ఎక్స్-రేల బేసిక్ ప్రిన్సిపుల్, ఎక్స్‌రేలను ఉపయోగించి చాలా వ్యాధులను నిర్ధారించవచ్చు. అవసరాన్ని బట్టి ప్లేన్ ఎక్స్‌రేలను లేదా కాంట్రాస్ట్ ఎక్స్-రేలను ఉపయోగిస్తారు. ప్లేన్ ఎక్స్‌రే ప్రాథమిక నిర్ధారణ పరీక్షగా పరిగణించబడుతున్నది. వీటిని ఎక్కువగా, ప్రీ ఆపరేటివ్ చెక్‌ఆప్‌కు, ఎముకలకు సంబంధించిన వ్యాధులకు, ప్రేగులకు రంధ్రం ఏర్పడడం (ఇంటస్టైనల్ అబ్‌స్ట్రక్షన్) వంటి వాటికి, కాల్సిఫికేషన్‌లను, మూత్రపిండాలు, మూత్రాశయంలోని రాళ్ళను గుర్తించడానికి, పిత్తాశయం (గాల్‌బ్లాడర్)లోని రాళ్ళను కనుక్కోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

కాంట్రాస్ట్ స్టడీ అంటే శరీరంలోకి బేరియం, అయోడిన్ వంటి పదార్థాలను ఇవ్వడం ద్వారా శరీర అవయవాల సాంద్రతను పెంచి ఎక్స్-రేలు తీసి స్టడీ చేయడమే. వీటిలో బేరియం ద్రావణాన్ని నోటిద్వారా ఇస్తారు. అయోడిన్‌ను రక్తనాళంలోకి ఇస్తారు. రోగి వ్యాధిని బట్టి ఏ పదార్థం ఎంత ఇవ్వాలి అన్నది రేడియోలజిస్ట్ నిర్ణయించడం జరుగుతుంది. ఈ కాంట్రాస్ట్ ఎక్స్-రేలనే, అన్నవాహిక వ్యాధుల నిర్ధారణ చేస్తే దానిని 'బేరియం





స్వాలో' అని, జీర్ణాశయ వ్యాధులకు చేసే 'బేరియంమీల్' అని, చిన్నప్రేవులకు చేస్తే 'బేరియం మీల్ ఫాలోత్రూ' అని, పెద్ద ప్రేవులకు చేస్తే 'బేరియం ఎనిమా' అని, క్లోమ్ గ్రంథికి చేస్తే 'ఇ.ఆర్.సి.పి.' అని, పైత్య రసనాళాలకు చేస్తే పి.టి.సి. అని, అలానే రక్తనాళాలలోకి కాంట్రాస్ట్ పదార్థాలను ఇవ్వడం ద్వారా మూత్రపిండాలు, మూత్రాశయాలను ఎక్స్‌రే తీస్తే దానిని 'ఇంట్రావీనస్ పైలోగ్రామ్' (ఐ.వి.పి.) అని, కరోనరీ రక్తనాళాలకు చేస్తే 'కరోనరీ ఏంజియోగ్రఫీ' అని, స్త్రీలలోని గర్భసంచి, ఫెలోఫియన్ ట్యూబులను పరీక్షించడానికి చేస్తే హిస్టిరోసాల్పింగోగ్రఫీ (హెచ్.ఎస్.జి.) అని, వెన్నుపాముకు చేస్తే మైలోగ్రామ్' అని అంటారు. ఈ కాంట్రాస్ట్ ఎక్స్‌రేలను పరీక్షించడం ద్వారా ఆయా అవయవాల వ్యాధులను గుర్తించడం సులభమవుతున్నది.

✤ స్కానింగ్ అంటే ఏమిటి? ప్రజలకు అందుబాటులోగల వివిధ స్కాన్‌లను తెలియజేస్తారా?

స్కానింగ్ అంటే శరీరంలోని అసాధారణత కోసం అంటే వ్యాధి కోసం అంగుళం, అంగుళం వెతకడమని (సెర్చింగ్ ఇంచ్ బై ఇంచ్) చెప్పుకోవచ్చు. ప్రస్తుతం అల్ట్రాసౌండ్ స్కాన్, సి.టి.స్కాన్, యం.ఆర్.ఐ. స్కాన్ వంటివి ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

✤ ఇకో కార్డియోగ్రఫీ, కలర్‌డాప్లర్ అంటే ఏమిటి ? వీటి గురించి స్థూలంగా తెలియజేస్తారా?

ఒక ప్రత్యేక ప్రోబ్ ద్వారా సాధారణ అల్ట్రాసౌండ్ స్క్రీన్‌మీదే గుండె, గుండెలోని కవాటాలను అధ్యయనం చేయడాన్ని స్థూలంగా ఇకో కార్డియోగ్రఫీ అంటారు. దీనిద్వారా గుండె కండరాల పనితీరును, కవాటాల కదలికలను, గుండెకు సంబంధించిన ఇతర వ్యాధులను తెలుసుకోవచ్చు. రక్తనాళాల సమాచారాన్ని తెలుసు కోవడానికి చేసే పరీక్షనే కలర్ డాప్లర్ అంటారు. దీని ద్వారా ఇకోకార్డియో గ్రఫీలో స్పష్టంగా తెలియని గుండె కవాటాల పనితీరును, రక్తనాళాలలో రక్తప్రసరణ మార్గాన్ని, రక్తప్రసరణ వేగాన్ని, తెలుసుకునే వీలున్నది. ముఖ్యంగా మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే కెరోటిడ్ రక్తనాళాల అధ్యయనంలో ఇది ఎంతగానో దోహదపడుతుంది.



✤ సి.టి.స్కాన్ అంటే ఏమిటి? ఎలా పని చేస్తుంది ?

సి.టి.స్కాన్ అంటే కంప్యూటెడ్ టోమోగ్రఫీ స్కాన్. ఇది ఎక్స్‌రేల ఆధారంగా పని చేస్తుంది. ఈ ఎక్స్–రేలు శరీరం గుండా ప్రయాణించి, కంప్యూటర్‌లో ఆ అవయవాల ఇమేజ్‌ను ఏర్పరుస్తాయి. ఈ ఇమేజ్‌ను టి.వి. స్క్రీన్ మీదకు ఫోకస్ చేయడం ద్వారా ఆ అవయవాన్ని పరీక్షించడం జరుగుతున్నది. సి.టి.స్కాన్ ద్వారా, శరీరంలోని అవయవాలను, ముఖ్యంగా మెదడును, ఏ లెవెల్‌లో కావాలంటే, ఆ లెవెల్‌లో సెక్షన్లుగా విడగొట్టి, ఫిల్మ్‌లను తీసుకొని పరీక్షించవచ్చు.

✤ సి.టి.స్కాన్ ఎలాంటి వ్యాధుల నిర్ధారణలో ఉపయోగపడుతోంది ?

సి.టి.స్కాన్ ముఖ్యంగా తల, మెదడు సంబంధ వ్యాధుల నిర్ధారణలో ఎనలేని సేవలను అందిస్తున్నది. మెదడులో రక్తం గడ్డకట్టడం, రక్తస్రావం, పక్షవాత కారణాన్ని, మూర్ఛ వ్యాధి లేదా ఫిట్స్‌కు గల కారణాలను, మెదడు క్షయను, తల పెద్దదిగా వున్న (హైడ్రోసెఫలస్) తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న వాటికి గల కారణాలను, మెదడువాపు వ్యాధిని, మెదడు పొరల వ్యాధులైన మైనింజైటిస్‌ను, రక్తస్రావాన్ని, మెదడులోని చీముగడ్డలను (ఏబ్‌సెస్‌లను), ట్యూమర్‌లను (ఇంట్రాక్రీనియర్‌స్పేస్ ఆక్యుపయింగ్ లీజన్‌లను) నిర్ధారించడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నది. ఇంకా పుర్రె ఎముకల్లో (స్కల్‌బోన్స్) ఫ్రాక్చర్స్‌ను కూడా గుర్తించే వీలున్నది. సి.టి.తో ఛాతి, పొట్టకూడా స్కానింగ్ చేయవచ్చు. ముఖ్యంగా ఈ స్కానింగ్ క్యాన్సర్ స్టేజింగ్‌ను తెలుసుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇంకా క్లోమగ్రంథి, ఎడ్రినల్ గ్రంథుల క్యాన్సర్‌లను గుర్తించడానికి వెన్నుపాముకు సంబంధించిన వ్యాధులను నిర్ధారించడానికి సి.టి.స్కాన్ దోహదపడుతున్నది.

✤ అల్ట్రాసౌండ్ స్కాన్‌తో పోల్చితే, సి.టి.స్కాన్ వల్ల గల అదనపు ప్రయోజనాలేమిటి?

అల్ట్రాసౌండ్ సంవత్సరంలోపు పిల్లల మెదడును పరీక్షించడానికి తప్ప పెద్దలలో మెదడును పరీక్షించడానికి పనికిరాదు. ఊపిరితిత్తులకు సంబంధించిన అన్ని వ్యాధులను అల్ట్రాసౌండ్ ద్వారా కనుక్కోలేము. ఎముకలకు సంబంధించిన వ్యాధులలో అల్ట్రాసౌండ్ అసలేమాత్రం ఉపయోగపడదు. బాగా లావుగా వుండే వారికి అంటే ఊబకాయం గల వారికి అల్ట్రాసౌండ్ సరైన ఫలితాలను ఇవ్వలేదు. క్యాన్సర్ స్టేజింగ్‌లో కూడా అల్ట్రాసౌండ్ పెద్దగా ఉపయోగపడదు. వీటన్నిటిలోనూ, సి.టి.స్కాన్ అద్భుతమైన ఫలితాలు ఇస్తుంది.

✤ ఎం.ఆర్.ఐ. అంటే ఏమిటి? రోగులకు ఇదెలా ఉపయోగపడుతున్నది ?

మాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్‌నే సంక్షిప్తంగా ఎం.ఆర్.ఐ. అంటారు. మన శరీరంలోని హైడ్రోజన్ ప్రోటాన్‌లను అయస్కాంతీకరించి, వాటిని స్టిమ్యులేట్ చేయడం వల్ల ఇచ్చే సిగ్నల్స్‌ను కంప్యూటర్‌లో ఇమేజ్‌గా మార్చి, ఆ ఇమేజ్‌ను పరీక్షించడం ద్వారా రోగ నిర్ధారణలో ఉపయోగపడుతున్నది.

✤ సి.టి.స్కాన్‌తో పోల్చితే ఎం.ఆర్.ఐ.లో గల అదనపు ఉపయోగాలేమిటి ?

సి.టి.స్కాన్ ప్రభావం శరీరంపై ఉంటుంది. కాని ఎం.ఆర్.ఐ. ప్రభావం శరీరంలో ఏ విధంగానూ ఉండదు. కనుక సురక్షితమైనది. వ్యాధికి సంబంధించిన వివరాలను సి.టి.స్కాన్ కంటే ఎం.ఆర్.ఐ. మరింత విశదీకరిస్తుంది. శరీర భాగపు అన్ని కోణాల నుంచి పరీక్షించే వీలున్నది. అలానే ఎం.ఆర్.ఐ. ద్వారా రక్తనాళాలను పరీక్షించవచ్చు. వెన్నుపాముకు సంబంధించిన అతి చిన్న అసాధారణతలను కనుక్కొనే అవకాశం ఉంది. సి.టి.స్కాన్‌లో ఇవి అంతగా కనుక్కోలేము. ఎం.ఆర్.ఐ.లో కాల్సిఫికేషన్‌లను గుర్తించలేము. అలాగే ఎక్యూట్ రక్తస్రావాన్ని కూడా గుర్తించలేము. అదే సి.టి.స్కాన్‌లో ఎక్యూట్ రక్తస్రావాన్ని, కాల్సిఫికేషన్‌లను సులభంగా గుర్తించవచ్చు. ఇలా ఒక్కోదానికి ఒక్కో విధమైన ప్రత్యేకతలున్నాయి. సాధారణంగా చాలా వ్యాధుల నిర్ధారణలో చాలా మంది వైద్యనిపుణులు సి.టి.స్కాన్ చేసిన తర్వాతనే ఎం.ఆర్.ఐ.ను ఆశ్రయించడం జరుగుతున్నది.

(హెల్త్‌హెల్ప్ సౌజన్యంతో)



సవరణ :

గత వారం మొటిమలు వ్యాసంలో చెమట గ్రంథులకు బదులు నూనె లేక సెబాసియస్ (sebacious) అని చదువుకోగలరు

– ఎడిటర్

పుస్తక పరిచయం

ఉపేక్షకు మూల్యం



The Wages of Impunity
Power, Justice and Human Rights;
Writer : K.G. Kannabiran;
Price : Rs.:550/-; **Pages :** 371
for copies: Orient Longman, Hyderabad

పౌరహక్కుల నేత, ప్రముఖ న్యాయవాది కె జి కన్నాబిరాన్ 1975 నుండి పలు సందర్భాలలో రాసిన వ్యాసాల సంకలనం ఇది. అయితే వాటిని కాలానుక్రమంగా కాకుండా విషయానుగుణంగా చక్కగా ఎడిట్‌చేసి పుస్తకరూపమిచ్చారు. దీనితో పాఠకునికి అది ఒక వ్యాసాల సంకలనం మాదిరిగా కాకుండా భారతరాజ్యాంగం, పౌరహక్కులు, చట్టం తదితర అంశాలకు సంబంధించి ఒక సమగ్ర గ్రంథాన్ని చదువుతున్న అనుభూతిని కలిగిస్తుంది.

వలసవాద సంప్రదాయాలను ప్రస్తుత పాలకులు ఇప్పటికీ కొనసాగించడాన్ని తొలివ్యాసాల్లోనే కన్నాబిరాన్ వివరిస్తారు. అప్పటి చట్టాలకు అనుగుణంగానే నిరంకుశంగా ప్రజాతంత్ర హక్కులు, పౌర హక్కులు ఎలా హరించబడుతున్నదీ ఆయన ఎంతో ఆవేదనతో తెలియ చేస్తారు. పాలకులే కాకుండా న్యాయమూర్తులు సైతం ఈ అవశేషాలను బాగా వంటబట్టించుకున్నారని విమర్శిస్తారు. మన లోపాలకు, పాపాలకు రాజ్యాంగాన్ని తప్పుబట్టడం సరికాదని ఆయన అభిప్రాయపడతారు. స్వాతంత్ర్యానంతర కాలంలో మన న్యాయస్థానాలు, రాజ్యాంగానికి నూతనంగా వలసపాలన నుండి విముక్తి చెందిన ప్రజల మనోభావాలకు, ఆకాంక్షలకు ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోకుండా వ్యాఖ్యానాలు చెప్పుకుంటూ వస్తున్నాయని ఆయన సోదాహరణంగా వివరిస్తారు.

భిన్నాభిప్రాయాన్ని అణచివేస్తూ ప్రజాతంత్ర వ్యవస్థలను రాజ్యం ఎలా ధ్వంసం చేస్తున్నదీ కన్నాబిరాన్ పలు వ్యాసాల్లో ఎత్తిచూపారు. ఉగ్రవాద విధ్వంసక చర్యల నిరోధక చట్టం (టాడా) అత్యంత హేయమైన రౌలట్ చట్టానికన్నా నిరంకుశమైనదన్న తన నిర్ధారణను పలు సంఘటనలను పేర్కొంటూ రుజువుచేశారు. రాజకీయ అశాంతికి కారణమైన అంశాలను పరిష్కరించడానికి పూనుకునేందుకు బదులు శాంతి భద్రతల పేరుతో అణచివేయడానికి ప్రయత్నించడాన్ని ఆయన నిశితంగా విమర్శించారు. తన చర్యలను కప్పిపుచ్చుకోవడానికి మాత్రమే ప్రభుత్వం మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఉధృతమయిన ఆయన పౌరహక్కుల పరిరక్షణ కృషి పలు నగ్జలైట్ గ్రూపులకు చెందిన వారి హక్కులను సమర్థిస్తూ కొనసాగింది. తాను ఈ కాలంలో ఫలితం లేని ఉదారవాద కబుర్లను, తీవ్రవాద వామపక్ష ఒంటెత్తువాదాన్ని అధిగమించ కలిగానని ఆయన చెప్పారు. పౌరహక్కుల న్యాయవాదులకు ఆయన ఇచ్చిన సలహాలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. ముందుగా తాము చట్టం కోసం నిలబడ్డ వారిగా పేరు తెచ్చుకోవాలని, ఏరకమైన తీవ్రవాద గ్రూపుతోను కలిసి పోకుండా తన స్వతంత్ర ప్రతిపత్తిని కొనసాగించినపుడు మాత్రమే పౌరహక్కులను సమర్థవంతంగా పరిరక్షించగలమని ఆయన చెబుతారు. నగ్జలైట్ గ్రూపులపై ప్రభుత్వం చట్టవిరుద్ధంగా విరుచుకు పడుతున్న తీరును నిశితంగా ఖండించిన కన్నాబిరాన్ తీవ్రవాద గ్రూపులు పాల్పడే హింసను మాత్రం వ్యతిరేకించరు.

న్యాయవాదుల గురించి, న్యాయమూర్తుల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు గమనించదగినవి. కాసులకు మాత్రమే వారు ప్రాధాన్యతనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీలోపడి వారు తమ అధ్యయనాన్ని మెరుగుపరుచుకోవడం లేదని తెలిపారు. న్యాయస్థానాలను ధనార్జన ప్రదేశాలుగా పరిగణిస్తున్నారని, సామాజిక బాధ్యత కలిగిన సంస్థలుగా వాటిని గుర్తించడం లేదని కన్నాబిరాన్ నిశితంగా విమర్శిస్తారు.

లౌకికవాదవ్యతిరేక హిందూమతోన్మాద రాజకీయాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తారు. లౌకికవాదం రాజ్యాంగ మౌలిక అంశమని బొమ్మై కేసులో సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన దృష్ట్యా మతోన్మాద రాజకీయాలను నిషేధించాలని కూడా ఆయన అభిప్రాయ పడ్డారు. పలు తీర్పుల్లో హిందూమతాన్ని, హిందూత్వను ఒక్కటిగా పరిగణించిన సుప్రీం కోర్టు హిందూ మతోన్మాదం పెచ్చరిల్లడానికి కారణమయిందని కూడా ఆయన ఘాటుగా విమర్శించారు.

రాజ్యాంగపరమైన అంశాలను ముఖ్యంగా ప్రాథమిక హక్కులు పౌరహక్కులకు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలనుకునే వారు, వాటి రక్షణ పట్ల ఆసక్తి, ఆందోళన కలిగిన వారు తప్పనిసరిగా చదవాల్సిన గ్రంథం ఇది. ఈ ఆంగ్ల గ్రంథానికి సంక్షిప్తంగానయినా తెలుగు అనువాదం తీసుకువస్తే మరింత ప్రయోజన కరంగా ఉంటుంది.

-జి.వి

స్వీకారం

మట్టిపువ్వు
రచన : ఎస్.జయ; వెల : రు. 30,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్; నవ్యసీమ, 1-65/బి, ప్రభాత్‌నగర్, గడ్డి అన్నారం, హైదరాబాద్

నకులుని ఆత్మకథ
రచన : హెచ్చార్కె; వెల : రు. 50,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్; నవ్యసీమ, 1-65/బి, ప్రభాత్‌నగర్, గడ్డి అన్నారం, హైదరాబాద్

శ్రీకాకుళ సత్యాలు
సంకలనం : మానేపల్లి; వెల : రు. 38,

ప్రతులకు :
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్;

శేషు

మధుర మీనాక్షి



కొండలమీదుగా కొడైకెనాల్ రైలుమార్గం

తమిళనాడులోని అత్యంత ప్రాచీన ప్రదేశాల్లో మధురై ఒకటి. కంచి కామాక్షి లాగా మధుర మీనాక్షి ఆలయం కూడా చాలా ప్రసిద్ధి చెందింది. క్రీస్తుపూర్వం కొన్ని శతాబ్దాల క్రితమే ఈ పట్టణం ఉనికిలో ఉన్నట్లు శాసనాలు చెబుతున్నాయి. చెన్నయి నగరానికి 472 కిలోమీటర్ల దూరాన వైగై నదీతీరాన గల ఈ పట్టణం రాష్ట్రంలో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోంది. ప్రత్యేకించి చేనేతకు మధురై పట్టణం చాలా పేరుపొందింది.

చాలా పురాతనమైన మధుర మీనాక్షి దేవాలయం ఎప్పటికప్పుడు ఆ ప్రాంతాన్ని పాలించిన రాజుల మనోభీష్టానికి అనుగుణంగా అనేక మార్పులకు గురైంది. పలుసార్లు పునర్నిర్మాణం కూడా జరిగింది. 12, 14వ శతాబ్దాల మధ్యలో ఎక్కువ మార్పులకు గురైంది. ఈ ఆలయంలో అందమైన శిల్పాలతో కూడిన 124 రాతి స్తంభాలున్నాయి. ఆలయానికి 12 గోపురాలు, వెయ్యి స్తంభాల మండపం, సంగీతాన్ని వినిపించే స్తంభాలు, కళా మ్యూజియం తదితర కట్టడాలను వివిధ కాలాల్లో పాలించిన రాజులు నిర్మించారు. 12 గోపురాలే ఆలయానికి ప్రధాన ఆకర్షణ. గోపురం ఒక్కొక్కటి 160 నుండి 170 అడుగుల ఎత్తు వరకు ఉంటుంది. పట్టణం శివార్లలో ఏడు ప్రాకారాలు నిర్మితమై ఉన్నాయి. ఆలయాన్ని కేంద్రంగా చేసుకునే పట్టణం కూడా నిర్మాణమైంది. సరిహద్దులుగానే ఏడు ప్రాకారాలు ఉన్నాయి. పట్టణం వలయాకారంలో ఉంటుంది. మధురై ఆలయంలోని నృత్యం చేసే శివుని విగ్రహం చాలా అరుదైనది. అదేవిధంగా 64 రూపాల్లో శివుడు నృత్యం చేస్తున్న శిల్పాలు కూడా ఈ ఆలయ ప్రత్యేకత.

కొడై కెనాల్

పశ్చిమ కనుమల్లో ఉన్న కొడై కెనాల్ ఒక అద్భుతమైన హిల్ రిసార్ట్. ఇక్కడ నిరంతరం సినిమాల షూటింగ్ జరుగుతుంది. ఈ ప్రాంతంలోని దట్టమైన అడవులు, పచ్చగా పరుచుకున్నట్లుండే మైదానాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. కొడైకెనాల్ నుండి పళని వరకు గల కొండమార్గంలోని ప్రకృతిదృశ్యాలు ఎంతో మనోహరంగా ఉంటాయి. పళనిలోని ఆలయ పరిసరాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి.

వన్యమృగ సంరక్షణ కేంద్రం

పశ్చిమకనుమల్లో గల మూడు వన్యమృగసంరక్షణ కేంద్రాల్లో తమిళనాడులోని అన్నామలై కేంద్రం పెద్దది. ఈ దట్టమైన అడవులు, కొండల్లో వెయ్యి చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వన్యమృగ సంరక్షణకేంద్రం నెలకొని ఉంది. ఎన్నో అరుదైన జంతువులు, పక్షులు ఇందులో ఉన్నాయి. ◆



మ్యాజిక్ స్టిక్ మనోహర్

ఆయన వృత్తిరీత్యా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ప్రవృత్తిరీత్యా 'మ్యాజిక్' కళలో అత్యంత ప్రతిభా పాటవాలతో ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసి అందరి మన్ననలు పొందుతున్న వ్యక్తి. రెండింటి మధ్యా లంగరు కుదిరే సమయం లేకున్నా రెండిటినీ తన తెలివితేటలతో, చాకచక్యంతో నెట్టుకువస్తూ న్యాయం చేకూరుస్తున్న వ్యక్తి మ్యాజిక్ మనోహరరావు. 'హిప్నాటిజం'లో సైతం అనుభవం వున్న ఈయన మ్యాజిక్ కళను కొత్త పుంతలు తొక్కిస్తూ మన రాష్ట్రం నుండి జాతీయ స్థాయిలో సైతం ప్రత్యేక గుర్తింపు పొందుతూ 'స్టిక్ మనోహర్'గా ప్రసిద్ధిగాంచారు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు' చూపే మ్యాజిక్ ప్రదర్శనకు 'సాధన' ఒక్కటే ప్రధాన భూమికను పోషిస్తుందనే ఈ 'స్టిక్ మనోహర్' ప్రదర్శించే అద్భుత కళానైపుణ్యం గురించి తెలుసుకుందాం.

చలపాక ప్రకాష్

వీధి గారడి విద్యను చూసి మ్యాజిక్ ప్రదర్శన చేయడానికి స్ఫూర్తి పొందానంటున్న మనోహర్ ఆంధ్రా యూనివర్సిటీ నుండి బి.కాం., బి.ఎల్. డిగ్రీలు పొందారు. 1961 జులై 12న రాజమండ్రిలో చంద్రావతి, శేషగిరిరావు దంపతులకు జన్మించిన మనోహర్, అభిరుచితో కళాశాల స్థాయి నుండే అనేక మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తూ ప్రజలలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాలను పారద్రోలటానికి తనవంతు కృషి చేస్తున్నారు. మ్యాజిక్ పట్ల ఆసక్తి గల వారికి దానిని నేర్పించాలనే ఉద్దేశంతో కాకినాడలో 'కాకినాడ మ్యాజిక్ స్కూల్'ను స్థాపించి ఎందరికో ఈ విద్యలో శిక్షణనిచ్చారు. మ్యాజిక్‌లోని ట్రిక్కులను గూర్చి అనేక దిన, వార, మాసపత్రికలలో వ్యాసాలు రాశారు. 'పల్లకి' వారపత్రికలో ఒక సంవత్సర కాలం 'మ్యాజిక్ మ్యాజిక్' శీర్షిక ద్వారా అనేక మందికి మ్యాజిక్ అంశాలు నేర్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని మెజీషియన్‌లను ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో 'మయూరి' వారపత్రిక ద్వారా ఒక సంవత్సరం పాటు 'మెజీషియన్ పెరేడ్' శీర్షిక ద్వారా మెజీషియన్లను తెలుగు ప్రజలకు పరిచయం చేశారు. ఆకాశవాణిలో మ్యాజిక్ గూర్చి పలుమార్లు ఉపన్యసించారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేకచోట్ల మ్యాజిక్ పై సెమినార్లు నిర్వహించారు. ఆంధ్రప్రభ దినపత్రికలో బాలప్రభలో 'మినీమ్యాజిక్' శీర్షికలో కేవలం అగ్గిపుల్లతోనే మ్యాజిక్ ట్రిక్స్ రాశారు. 'అగ్గిపుల్లలతో మ్యాజిక్కులు' పేరున పుస్తకం రచించారు. మ్యాజిక్ జోక్స్ కూడా పత్రికలలో రాసి పాఠకుల మన్ననలు పొందారు. జాతీయ స్థాయిలో వందలాది ప్రదర్శనలిచ్చిన మనోహర్ పోలీస్ శాఖ ఏర్పాటు చేసే ఫంక్షన్లలో కూడా ప్రదర్శనలిచ్చి సాటి ఉద్యోగుల మన్ననలు పొందారు.

మనోహర్ సృష్టించిన ప్రత్యేక అంశాలు :

మ్యాజిక్ అంశాలు చేయడమే కాదు వాటిని తయారు చేయడంలోనూ, కొత్త కొత్త అంశాలను కనిపెట్టడంలోనూ కూడా మనోహర్ నైపుణ్యాన్ని పదర్శించారు. మనోహర్ చేసిన ఆర్డినరీ 'ప్లేయింగ్ కార్డు'తో చేసిన అంశాలను చూసి, ఇండియన్ ఫేమస్

కార్డిషియన్ శేఖర్ (కరూర్) ఈయన అభిమాని అయ్యారు. వీరు కనిపెట్టిన ప్లేయింగ్ కార్డు ట్రిక్‌ను కలకత్తాకు చెందిన శ్యామ్‌దలాల్ దానికి పాకెట్ ట్రికార్డ్‌మాంటేగా పేరు పెట్టి నేషనల్, ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ప్రవేశ పెట్టడం విశేషం. అనేకమంది జాతీయ, అంతర్జాతీయ మెజీషియన్‌లతో మనోహర్‌కు సత్సంబంధాలున్నాయి.

గత మే 20, 21, 22 తేదీలలో 'ఖుల్‌జా సిం-సిం' పేరుతో రాజస్థాన్ రాష్ట్రంలోని సిరోహిరోడ్‌లో జరిగిన అఖిల భారత మ్యాజిక్ పోటీలలో ప్రథమ బహుమతిని పొంది తన ప్రత్యేకత చాటుకున్న మనోహర్ 'నాలుగు పెద్ద పెద్ద రింగులతో చేసిన విన్యాసాలు ఆ పోటీలో పాల్గొన్న 300 మందిని ఆశ్చర్య చకితులను చేసింది. భారతదేశంలోనే ఈ తరహా విన్యాసాన్ని తొలిసారిగా మనోహర్ ప్రదర్శించారు. ఈ విన్యాసాన్ని చూసిన ప్రఖ్యాత అంతర్జాతీయ మెజీషియన్ హకాసా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

'మ్యాజిక్ కరిష్మా 2002' పేరిట గోవా రాష్ట్ర రాజధాని పనాజీలో అఖిల భారత మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రెండవ జాతీయస్థాయి మ్యాజిక్ పోటీలతో తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. తనకంటూ ఈ విధంగా ప్రత్యేకతను సంతరింప చేసుకున్న ఈయన 'స్టిక్స్'తో ఆ పోటీలలో చేసిన విన్యాసాలు పోటీల్లో పాల్గొన్న 500 మందిని ఆశ్చర్య చకితుల్ని చేసి అబ్బురపరిచింది. భారతదేశంలో ఈ విన్యాసాన్ని తొలిసారిగా ప్రదర్శించిన మనోహర్ ప్రతిభకు మెచ్చి అకాడమీ వారు ఈ సందర్భంగా ఇచ్చిన బిరుదే 'స్టిక్ మనోహర్'.

అవార్డులు - రివార్డులు :

రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయిలో తాను ప్రదర్శించిన ప్రదర్శనలకు మనోహర్‌కు ఎన్నో అవార్డులు, రివార్డులు లభించాయి. ఎన్నో మ్యాజిక్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పి.సి.సర్కార్ (జూనియర్) నుండి సన్మానం, ప్రత్యేక అభినందనలు అందుకొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని నెల్లూరు వారి నుండి మాయాజాల మహేంద్ర, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ విజయవాడ నుండి మిలీనియం స్టార్ అవార్డు, రాజమండ్రి గౌతమి కల్చరల్ అసోసియేషన్ నుండి మ్యాన్ ఆఫ్ ది ఇయర్, కింగ్ ఆఫ్ మెజీషియన్స్ బిరుదును, ఏలూరు రేంజ్ డి.ఐ.జి. సి.వి.నర్సయ్య నుండి, ఖమ్మం ఆనందలహరి సంస్థ నుండి సూపర్ మెజిషియన్ బిరుదు, ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం-2004, రాష్ట్ర వికాస శిరోమణి అవార్డు ఇంకా వివిధ సందర్భాలలో అనేక సంస్థలు అవార్డులు, రివార్డులతో మనోహర్ మ్యాజిక్ ప్రదర్శనలకు మెచ్చి సత్కరించాయి. వివిధ సందర్భాలలో వివిధ పదవులు అలంకరించిన మనోహర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్స్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై మ్యాజిక్ కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు.

మ్యాజిక్ నేర్చుకోవాలనుకునే వారికి మీరిచ్చే సూచనేంటని అడిగితే మెజీషియన్‌కి ఆత్మ స్థయిర్యం, హస్తలాఘవం ప్రధానమన్నారు. మెజిషియన్‌గా సక్సెస్ కావాలంటే ఏమేమి కావాలని అడగ్గా దానికి మూడు లక్షణాలు కావాలంటారు. అది ఒకటి ప్రాక్టీస్, రెండు ప్రాక్టీస్, మూడు ప్రాక్టీస్ అని లౌక్యంగా చెబుతారాయన. ◆

హెచ్చరిక

ఎన్నాళ్ళు కూయించగలవు
కోయిలను బంధించి
వసంతరాగాలను
ఎన్నేళ్ళు రాయించగలవు
కవులను బాధించి
అద్భుత కావ్యాలను
ఎప్పుడూ బలవంతమే
అవుతుందా ఫలవంతం
పోరాడితే అందరి సొంతం
కాదా వసంతం.

నీ కనుచూపు ఆదేశాలతో
దేశాల రూపు మారుస్తున్నావు
పోలీసుతనంతో ప్రపంచ
ప్రజాస్వామ్యాన్ని పాడు చేస్తున్నావు
యుద్ధమే నా రాజనీతి అంటూ
నిశ్శబ్దాన్ని హేళన చేస్తున్నావు
సామ్రాజ్యవాదమే నా విధానమంటూ
కదనానికి కాలుదువ్వుతున్నావు.

వియత్నాం పసిపిల్లల సాక్ష్యంగా
ఆఫ్ఘనిస్తాన్ మహిళల సాక్ష్యంగా
చావుకు ముందే నరకం చూస్తున్న
ఇరాక్ యుద్ధ ఖైదీల సాక్ష్యంగా
సామ్రాజ్యవాదమా 'హెచ్చరిక'
అదిగో అటు చూడు ఓసారి
గాయపడిన గళాలు
విప్లవ గేయాలను ఆలపిస్తున్నాయి
గాడితప్పిన కలాలు
మరల అరుణకావ్యాలను రాస్తున్నాయి
సామ్రాజ్యవాదమా!
నీ శకానికిక ముగింపు
నవశకానికిక ఆరంభం.

- బండారు రమేష్

తనువుచాలించిన 'తొలకరి'

తొలకరి రాక మునుపే తొందరపడ్డావా
నమ్మిన వాళ్లను నట్టేటొదిలి గాలిన కలిశావా-ప్రాణం
వదిలావా
రైతన్నా...ఓ రైతన్నా...
విత్తనాలకని తెచ్చిన అప్పు-ఎరువుల కోసం చేసిన
అప్పు
చీడపీడలలో తప్పని ముప్పు-పురుగుమందులకు
తప్పని అప్పు
చేసిన అప్పులే ఉరితాళ్లయినాయా! నీ ఉసురును
తీసాయా
రైతన్నా...ఓ రైతన్నా
నేలతల్లి ఎండిన గుండెన-ఎన్నితడవల రంధ్రం
వేసిన
చెమ్మ దొరకక చట్టు తగలక-సుద్దమన్నే కుప్పలు
పడగ
వాడిన పంటే కనుమంటయ్యిందా -నిను కాటికి
పంపిందా రైతన్నా...ఓ రైతన్నా
రేటులుండగా పంటపోయెనా-పంటలొస్తే రేటు
తగ్గేనా
దళారోళ్ల దొంగదెబ్బకు మార్కెటు రాజుల
మాయలాటకు
నలిగిన టమోటా నీ బతుకయ్యిందా
నిను చితికి పంపిందా రైతన్నా... ఓ రైతన్నా
కల్తీ విత్తులు కల్తీ ఎరువులు కల్తీ మందులు కళ్లకు
గంతలు
మోసపోవడం కూడా వ్యవసాయంలో భాగమాయెనా
రైతే రాజని పాడిన రాజ్యం
రైతుకిచ్చిన కానుకలివేనా రైతన్నా...ఓ రైతన్నా



- శ్రీనివాసరెడ్డి

న్యాయసలహాలు

ADVOCATE

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

మా పొలం మాకు రావాలంటే ఎలా?

మాకు కొంత మెట్టపొలం ఉంది. దానికి సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నాము. 2000వ సంవత్సరంలో మా పొలాన్ని మండల సర్వేయర్ గారికి సర్వే ఫీజు చెల్లించి సర్వే చేయించగా కొంత స్థలం ఆక్రమణకు గురైనట్లుగా తెలిసింది. ఆక్రమణకు గురైన విషయం సర్వే చేయించిన తర్వాత మాత్రమే మాకు తెలిసింది. మా స్థలం ఆక్రమణకు గురై దాదాపు 30 సంవత్సరాలు అవుతున్నది. ఈ విషయం పెద్దల ద్వారా పరిష్కరించుకుందామని ప్రయత్నించినా ఫలితం లేకపోయేసరికి, ఎం.ఆర్.ఓ. వారికి 2001లో పిటీషన్ ఇవ్వడం జరిగింది. ఇంతవరకూ వారు ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఆక్రమణకు గురైన మా స్థలాన్ని స్వాధీనపరచవలసిన బాధ్యత రెవెన్యూ అధికారులకు ఉంటుందా లేదా? లేకపోతే మేమేం చెయ్యాలి? కోర్టుకు వెళ్ళే స్తోమత మాకు లేదు. స్థలం మాకు రావాలంటే ఏం చెయ్యాలో తగిన సలహా ఇవ్వగలరని కోరుతున్నాను.

– ప్రకాశరావు, ఊరుపేరు రాయలేదు

మీరు రికార్డు ప్రకారం వున్న ఆస్తిపై పన్నులు కడుతున్నారు. కనుక మీరు చట్ట ప్రకారం పొజిషన్లో వున్నట్లే. పక్కవారు దురాక్రమించినట్లవుతుంది. కావున ఇన్ని రోజులు వాళ్ల పొజిషన్లోనే ఉందని తెలపకుండా మీ పొజిషన్లో వుంటున్నట్లే చెబుతూ దావా వేయాల్సి ఉంటుంది. రెవెన్యూ సిబ్బందికి భూమిని మీకు స్వాధీనపరిచే అధికారాలు ఏమీ ఉండవు. మీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందే.

మాకు న్యాయం చేయండి

మేము ఒక ప్రముఖ దినపత్రికకు సేల్స్ ప్రమోటర్స్‌గా పని చేశాము. వాళ్ళు ఇచ్చిన యాడ్ ప్రకారం అలవెన్స్ డి.ఏ.లు కలిపి నెలకు రు.3,500లు ఇవ్వాలి. రోజుకు మూడు కాపీలు చొప్పున నెలకు 100 కాపీలకు చందాదారులను చేర్పించాలి. మేము 22.2.04న 360 మందిని సభ్యులుగా చేర్పించాం. 22-3-04 నాటికి నెల రోజులైంది. మాకు ఇవ్వాల్సిన జీతం ఆఫీసు నుంచి రాలేదని 10-4-04న వస్తాయని చెప్పారు. 1-4-04 నుంచి మాకిచ్చే అలవెన్స్ విధానాన్ని మారుస్తున్నామని కాపీకి రు.23 చొప్పున ఎన్ని కాపీలు చేస్తే అన్ని కాపీలకు ఇస్తామని 29-3-04న చెప్పారు. ఆ పద్ధతి నచ్చక మేము మానివేశాము. మేము చేసిన నెల రోజులకు జీతం అడగ్గా 10-4-04న రమ్మని చెప్పాను. 10వ తారీకు వెళ్ళి అడగ్గా రు.500 ఇచ్చి మిగిలిన డబ్బుకు రెండు రోజుల తరువాత రమ్మని చెప్పారు. తరువాత వెళ్ళి అడగ్గా ఆఫీసు వాళ్ళు రు.23 చొప్పునే ఇచ్చారని మాకు నెల జీతం ఏమీ రాదని చెప్పారు. ఎందుకని అడగ్గా డి.ఏ.లు ఇచ్చామని చెప్పారు. ఆ డి.ఏ. కూడా సరిగ్గా ఇవ్వలేదు. మూడు కాపీలు చేసిన రోజునే ఇచ్చారు. వాళ్ళు చెప్పిన పద్ధతి ప్రకారం నెలకు ముగ్గురం కలసి 360 కాపీలు పైనే చేశాం. కాని మాకు నెలకు డి.ఏ.లు పోగా అందవలసిన జీతం నెలకు రు.2000లు ఇవ్వకపోగా కాపీకి 23 చొప్పున అయినా ఇవ్వమని అడగ్గా ఇంప్లిమెంట్ కాని కొన్ని కాపీలు ఉన్నాయని అవి చేస్తేనే ఇస్తామని చెప్పగా ఇప్లిమెంట్ అయినంత వరకు ఇవ్వమంటే కుదరదన్నారు. ఇదే మాట ఆఫీసు వాళ్ళను అడగ్గా మీ డి.ఓ.నే అడగండి మాకు సంబంధం లేదు అంటున్నారు. అసలు వాళ్లిచ్చిన యాడ్ ప్రకారం నెలజీతం రు.3500 ఇవ్వాలి. అలా ఇవ్వకుండా పద్ధతి మార్చామంటూ మాకు అన్యాయం చేశారు. మాకు ఉన్న ఆధారం ఒక్కటే, వాళ్ళు ఇచ్చిన డి.ఏ., మేము చేర్పించిన కాపీలు ఒక పుస్తకంలో పొందుపరిచాం. ఆ ఆధారాలతో మేము ఏమైనా చేయవచ్చా! వాళ్ళ నుండి మాకు జీతం రావాలంటే మేము ఏమి చేయాలో సలహా ఇవ్వగలరు.

– జె.బి.పి.కుమార్, మంగళగిరి.

మీ వద్దనున్న అన్ని ఆధారాలతో లేబర్ కమిషనర్‌ని కలవాల్సి ఉంటుంది. మీ దగ్గర డాక్యుమెంట్స్‌తో సహా సాక్ష్యాలు ఉంటే వివరంగా లేబర్ ఆఫీసర్‌ని కలిసి దావా వేస్తే మీరు మొత్తం జీతాన్ని పొందగలుగుతారు. పూర్తి వివరాలు చదవకుండానే మీరు ఉద్యోగంలో చేరేటప్పుడు సంతకాలు ఏమైనా చేసి వుంటే మీరు పొందలేకపోవచ్చు. ఏదేమైనా మీ దగ్గరలోని లేబర్ ఆఫీసులో సంప్రదించగలరు.

బియ్యం పిండి గారెలు

కావలసిన వస్తువులు:

బియ్యం పిండి	:	నాలుగు కప్పులు
అల్లం	:	ఒక అంగుళం ముక్క
పెరుగు	:	రెండు కప్పులు
జీలకర్ర	:	ఒక స్పూను
పెద్ద ఉల్లిపాయ	:	ఒకటి
పచ్చిమిర్చి	:	ఐదు
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం:

బియ్యం పిండి బరకగా ఉండాలి. బియ్యం పిండిలో పెరుగు వేసి గారెల పిండిలా కలుపుకోవాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు కోసుకొని కొంచెం జీలకర్ర, ఉప్పు కలుపుకోవాలి. అల్లం వేసుకోవాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగిన తరువాత కలిపిన పిండిని గారెల్లా చేసి వేగనిచ్చి తియ్యాలి. వేడిగా కరకరలాడుతూ చాలా బాగుంటాయి.

కావలసిన వస్తువులు :

సేమ్యా	:	పావు కిలో
బియ్యం పిండి	:	అర కిలో
ఉల్లిపాయలు	:	మూడు
మజ్జిగ	:	ఒక గ్లాసు
నూనె	:	వంద గ్రాములు
పచ్చిమిర్చి	:	పది
ఉప్పు	:	తగినంత



సేమ్యా దోశ

తయారుచేసే విధానం:

ఉల్లిపాయలు, పచ్చి మిర్చి సన్నగా తరగాలి. బియ్యం పిండి జల్లించి ఉంచుకోవాలి. ఒక గంట ముందుగా సేమ్యాను మజ్జిగలో నానబెట్టాలి. నానిన తరువాత చేత్తో నలపాలి. సన్నగా తరిగి ఉంచుకున్న ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, బియ్యం పిండి, సేమ్యాతో కలిపి తగినంత ఉప్పువేసి ఒక గ్లాసు నీళ్ళతో అట్లపిండిలా జారుగా కలుపుకోవాలి. పెనం కాలిన తరువాత నూనె వేసి గరిటతో పలుచగా అట్టు పోసుకోవాలి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ. / డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761

మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.

Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com